# బ్రిటన్ ప్రధానికి కరోనా

- స్వీయ నిర్బంధంలో బోరిస్ జాన్సన్
- ఆన్‌లైన్‌లోనే పాలన నడిపిస్తానని వెల్లడి


బోరిస్ జాన్సన్

**లండన్:** బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు కరోనా సోకింది. ఈ విషయాన్ని ఆయనే ట్విట్టర్ ద్వారా శుక్రవారం వెల్లడించారు. గత 24 గంటల నుంచి స్వల్పంగా వైరస్ లక్షణాలు కనిపించాయని, పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను స్వీయ నిర్బంధంలో ఉన్నట్లు చెప్పారు. కరోనాని ఎదుర్కొనేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాను ప్రభుత్వాన్ని నడిపిస్తానని తెలిపారు. బ్రిటన్ వైద్య శాఖ మంత్రి మ్యాట్ హ్యాంకాక్‌కు కూడా వైరస్ సోకింది.

## కరోనా బారిన పడిన ప్రముఖులు


**ప్రిన్స్ చార్లెస్:** బ్రిటన్ రాణి ఎలిజబెత్-2 పెద్ద కుమారుడు ప్రిన్స్ చార్లెస్‌కు కరోనా సోకింది. భార్య కెమెల్లాతో కలిసి స్కాట్లాండ్‌లోని నివాసంలో ఐసొలేషన్‌లో ఉన్నారు.


**హార్వే విన్‌స్టీన్:** లైంగిక నేరారోపణలు రుజువుకావడంతో 23 ఏండ్ల జైలు శిక్షను ఎదుర్కొంటున్న ప్రముఖ హాలీవుడ్ నిర్మాత హార్వే విన్‌స్టీన్‌కు జైళ్లో కరోనా సోకింది.


**కనికా కపూర్:** భారత్‌లో కరోనా బారిన పడిన మొదటి సెలబ్రిటీ కనికాకపూర్. విదేశాల నుంచి తిరిగొచ్చిన ఆమెకు వైరస్ సోకింది.


**టామ్ హాంక్స్, రీటా విల్సన్:** ఆస్కార్ అవార్డు గ్రహీత టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా విల్సన్ కూడా కరోనా బారినపడ్డారు.



**సోఫీ ట్రూడో:** కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో సతీమణి సోఫీ ట్రూడోకు కరోనా సోకింది.


**ఓల్గా కురిలెంకో:** హాలీవుడ్ నటి ఓల్గా కురిలెంకో కూడా కరోనా బారినపడ్డారు.

హాలీవుడ్ నటులు క్రిస్టోఫర్ హివ్‌జు, ఇందిర వర్మ, హాలీవుడ్ నటి రాచెల్ మాథ్యూస్, నటుడు ఇద్రిస్ ఎల్బా, భార్య సబ్రినాకు కరోనా వైరస్ సోకింది. ఎన్‌బీఏ స్టార్ కెవిన్ దురంత్‌కు వైరస్ నిర్ధారణ అయింది. కరోనా బారినపడిన తొలి బ్రిటన్ పార్లమెంట్ సభ్యురాలు, వైద్య ఆరోగ్య మంత్రి నదినే డోరిస్. కరోనా సోకిన మొదటి అమెరికన్ సెనేటర్ రాండ్ పాల్, తొలి అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మారియో డయాజ్ బలార్ట్. మరో సభ్యుడు బెన్ మెక్ ఆడమ్స్‌కు కరోనా సోకింది. ఇరాన్ డిప్యూటీ వైద్య శాఖ మంత్రి ఇరజ్ హరిర్చి కరోనా బారినపడ్డారు. ఆస్ట్రేలియా హోం శాఖ మంత్రి పీటర్ డుటన్‌కు పాజిటివ్ రావడంతో దవాఖానలో ఉంచారు.


# 15 లక్షల మంది

- గత రెండునెలల్లో భారత్‌కు వచ్చిన విదేశీయుల సంఖ్య
- వారందరిపై సరైన నిఘా లేదు.. వెంటనే చర్యలు తీసుకోండి
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం
- దేశంలో 724కు పెరిగిన బాధితులు.. 17 మరణాలు



**న్యూఢిల్లీ, మార్చి 27:** కరోనా కేసుల వృద్ధిరేటులో కాస్త తగ్గుదల కనిపిస్తున్నదంటూ స్వల్ప ఉపశమనం కలిగించిన కేంద్రం.. 24 గంటలు గడువకముందే ఓ బాంబు పేల్చింది. విదేశాల నుంచి గత రెండు నెలల్లో మన దేశంలోకి దాదాపు 15 లక్షల మంది వచ్చారని తెలిపింది. వారిపై సరైన నిఘా లేదని వెల్లడించింది. వెంటనే రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని, వారిపై నిఘా పెంచాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గుహ గురువారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఇమ్మిగ్రేషన్ బ్యూరో ఇచ్చిన వివరాలమేరకు జనవరి 18వ తేదీ నుంచి మార్చి 23వ తేదీ మధ్య 15 లక్షల మంది అంతర్జాతీయ ప్రయాణికులు భారత్‌కు వచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో పరిశీలనలో ఉన్న విదేశీ ప్రయాణికుల సంఖ్యకు, అసలు సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉన్నదన్నారు. ఈ 15 లక్షల మంది విమానాల ద్వారా వచ్చినవారు మాత్రమేనని, సముద్రమార్గంలో, అంతర్జాతీయ సరిహద్దుల గుండా వచ్చినవారు అదనమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## 75 కొత్త కేసులు



దేశంలో గత 24 గంటల్లో 75 కొత్త కేసులు నమోదైనట్టు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. దీంతో బాధితుల సంఖ్య 724కు పెరిగింది. వైరస్ బారినపడి మరొకరు మృతిచెందడంతో.. మరణాల సంఖ్య 17కు చేరింది. బాధితుల్లో 66 మంది కోలుకున్నారని లవ్ అగర్వాల్ వెల్లడించారు. కరోనావైరస్‌కు ఔషధాన్ని కనుగొనేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టిన 'సాలిడారిటీ ట్రయల్'లో భారత్ త్వరలో పాలుపంచుకోనున్నదని ఐసీఎంఆర్ ప్రతినిధి రామన్ ఆర్ గంగఖేద్కర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 30 బృందాలు కరోనాకు విరుగుడు కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. భారత బృందం సైతం వ్యాక్సిన్ తయారీకి కృషి చేస్తున్నదన్నారు. 40వేల వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వలస కార్మికులకు, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు, ఉద్యోగులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని అన్ని రాష్ట్రాలను కోరామన్నారు. హోటళ్లు, అద్దె నివాసాలు, హాస్టళ్లను తెరిచే ఉంచాలని ఆదేశించామన్నారు.

## అమెరికాలో పర్యాటక వీసాల గడువు పొడిగింపు

### భారతీయులకు ఊరట




**వాషింగ్టన్:** భారత ప్రభుత్వం అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేయడంతో అమెరికాలో చిక్కుకుపోయిన భారతీయులకు ఆ దేశ ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నది. పర్యాటక వీసాపై వచ్చినవారిలో గడువు పూర్తయినవారు 'యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్' (యూఎస్‌సీఐఎస్)కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. పరిశీలించి, వీసా గడువును పొడిగిస్తామని చెప్పారు. అంతర్జాతీయ విమానసర్వీసులు ప్రారంభమైన వెంటనే స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు హెచ్1బీ వీసా గడువు ముగిసినవారికి సైతం మరికొంత కాలం పాటు ఇక్కడే ఉండేలా వెసులుబాటు కల్పిస్తామన్నారు.

## అత్యవసర సేవలకు మేం సిద్ధం: గోఎయిర్



**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో ప్రభుత్వానికి అత్యవసర సేవలు అందించేందుకు గోఎయిర్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి అవసరమైన సరుకులు, ఆహార పదార్థాలు, నిత్యావసరాలు, మందుల రవాణాతోపాటు డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనే వ్యక్తులను తరలించేందుకు, విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను తీసుకొచ్చేందుకు, దేశంలోని పలు ప్రాంతాల్లో చిక్కుకున్న విదేశీ, స్వదేశీ నిపుణులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు తమ విమానాలు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు శుక్రవారం లేఖ రాసింది. మరో ప్రైవేట్ విమాయాన సంస్థ ఇండిగో కూడా ఇటీవల కేంద్రానికి ఇలాంటి ప్రతిపాదనే చేసింది. కరోనాపై పోరులో భాగంగా పలు ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి బాసటగా ముందుకొస్తున్నాయి.

## కరోనా క్లాక్

27-3-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 5.74 లక్షలు |
| మరణాలు | 26,369 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 94,425 | 1429 |
| చైనా | 81,340 | 3,292 |
| ఇటలీ | 80,539 | 8,015 |
| స్పెయిన్ | 64,059 | 4,858 |
| జర్మనీ | 49,344 | 304 |
| ఇరాన్ | 32,332 | 2,378 |
| ఫ్రాన్స్ | 29,155 | 1,696 |
| యూకే | 14,579 | 759 |
| దక్షిణ కొరియా | 9,332 | 139 |
| స్విట్జర్లాండ్ | 12,311 | 207 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 724 |
| మరణాలు | 17 |


### దేశంలో కరోనా కేసులు

| | | |
|---|---|---|
| కేరళ | మహారాష్ట్ర | కర్ణాటక |
| 164 | 153 | 64 |
| తెలంగాణ | ఉత్తరప్రదేశ్ | రాజస్థాన్ |
| 59 | 50 | 50 |
| గుజరాత్ | ఢిల్లీ | పంజాబ్ |
| 47 | 40 | 38 |
| తమిళనాడు | హర్యానా | మధ్యప్రదేశ్ |
| 38 | 33 | 29 |
| జమ్ము | ప. బెంగాల్ | ఏపీ |
| 18 | 15 | 13 |



## ఆ 'దగ్గు' విలువ రూ.26 లక్షలు!

**పెన్సిల్వేనియా:** కరోనా కారణంగా దేశాలకు దేశాలు లాక్‌డౌన్ అవుతున్నాయి. నిత్యావసరాల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాలో ఒక మహిళ చేసిన పిచ్చి చేష్టతో ఒక సూపర్‌మార్కెట్ ఏకంగా రూ.26 లక్షల విలువైన ఆహార పదార్థాలను పారబోయాల్సి వచ్చింది. ఆమె ఉద్దేశపూర్వకంగా ఆహార పదార్థాలపై దగ్గింది. దీన్ని ప్రాంక్‌గా (సరదా చేష్టగా) తాము పరిగణించినప్పటికీ, కస్టమర్ల ఆరోగ్యం దృష్ట్యా ఆ సరుకునంతటినీ పారబోసినట్లు స్టోర్ యాజమాన్యం వెల్లడించింది. పోలీసులు ఆమెను అరెస్ట్‌చేశారు.



## ప్రసిద్ధ చిత్రకారుడు సతీశ్ గుజ్రాల్ కన్నుమూత

**న్యూఢిల్లీ:** ప్రసిద్ధ చిత్రకారుడు, శిల్పి, ఆర్కిటెక్ట్ సతీశ్ గుజ్రాల్ (95) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో గురువారం రాత్రి ఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. సతీశ్ గుజ్రాల్ దివంగత ప్రధాని ఐకే గుజ్రాల్ సోదరుడు. ఆయనకు భార్య కిరణ్, కుమార్తెలు అల్పన, రసీల్, కుమారుడు మోహిత్ ఉన్నారు. 1999లో కేంద్రం ఆయనను పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఆయన మృతి పట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు.

## విమానాల రాకపోకలపై నిషేధం పొడిగింపు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ నేపథ్యంలో దేశీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలపై నిషేధాన్ని పొడిగించినట్లు 'డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ) శుక్రవారం వెల్లడించింది. ఏప్రిల్ 14-15 అర్ధరాత్రి తర్వాత పరిస్థితి సమీక్షించి రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు తెలిపింది.

## కేంద్ర మాజీమంత్రి బేణి ప్రసాద్‌వర్మ కన్నుమూత

**లక్నో:** కేంద్రమాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకనేత బేణి ప్రసాద్ వర్మ (79) శుక్రవారం కన్నుమూశారు. దేవెగౌడ, మన్మోహన్‌సింగ్‌ల హయాంలో ఆయన కేంద్రమంత్రిగా పనిచేశారు.

## వార్తా పత్రికల ద్వారా వైరస్ వ్యాప్తి జరుగదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వార్తా పత్రికల ద్వారా వైరస్ వ్యాప్తి జరుగదని, ఈ మేరకు శాస్త్రీయ ఆధారాలున్నాయని ఇంటర్నేషనల్ న్యూస్ మీడియా అసోసియేషన్ (ఐఎన్‌ఎంఏ) వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు, పలు అంతర్జాతీయ పరిశోధన సంస్థలు దీనిపై అధ్యయనం చేశాయని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడా కూడా పత్రికల ద్వారా కరోనా వ్యాప్తి జరిగిన దాఖలాలు లేవని స్పష్టం చేసింది.

## క్వారంటైన్ ఉల్లంఘన, కేరళ ఐఏఎస్‌పై కేసు

**కొల్లం:** క్వారంటైన్ నియమాలను ఉల్లంఘించిన కేరళ ఐఏఎస్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. హనీమూన్ కోసం మలేషియా-సింగపూర్‌కు వెళ్లివచ్చి..ఆపై ఇంట్లో స్వీయ నిర్బంధంలో ఉండకుండా బయటతిరిగిన కొల్లం సబ్‌కలెక్టర్ అనుపమ్ మిశ్రాపై కేసు నమోదుచేశారు. కనీస సమాచారం ఇవ్వకుండా రాష్ట్రాన్ని వదిలి వెళ్లినందుకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## దూరదర్శన్‌లో నేటి నుంచి మళ్లీ రామాయణం

**న్యూఢిల్లీ:** దూరదర్శన్‌లో మరోసారి రామాయణం సీరియల్ కనువిందు చేయనున్నది. శనివారం నుంచి తిరిగి ప్రసారం చేయనున్నట్టు కేంద్రమంత్రి జవదేకర్ శుక్రవారం వెల్లడించారు. 'ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఒక ఎపిసోడ్‌ను, రాత్రి 9 నుంచి 10 గంటల వరకు మరో ఎపిసోడ్‌ను ప్రసారం చేయనున్నాం' అని కేంద్రమంత్రి శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## అంత్యక్రియలకు 15 మందే

**డెహ్రాడూన్:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఉత్తరాఖండ్ పోలీసులు మరిన్ని పరిమితులు విధించారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు 15 మందికే అనుమతిస్తామని స్పష్టం చేశారు. అంత్యక్రియలకు వెళ్లేవారికి ఎలాంటి అంతరాయం లేకుండా వాహనాల సదుపాయం కల్పిస్తామని, పాస్‌లను జారీచేస్తామని చెప్పారు. అక్కడ కూడా సామాజిక దూరం పాటించాలని కోరారు.

# విపత్తు అంచున అమెరికా

- ఒక్కరోజే దాదాపు 10వేలకుపైగా కేసులు నమోదు
- 95వేలకు చేరిన బాధితులు
- వారంలోనే పదిరెట్లు పెరిగిన కేసులు, ఐదురెట్ల మరణాలు
- ప్రపంచంలోనే మొదటిస్థానానికి
- 1,300 దాటిన మరణాల సంఖ్య

**వాషింగ్టన్:** చైనా.. ఇటలీ.. స్పెయిన్.. ఇలా ఒక్కో దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్న కరోనా వైరస్ ఇప్పుడు అమెరికాపై అనూహ్యస్థాయిలో విరుచుకుపడుతున్నది. అగ్రరాజ్యంలో శుక్రవారం పదివేలకు పైగా కేసులు నమోదయ్యాయి. గురువారం 16,877 కరోనా పాజిటివ్ కేసులు పెరిగాయంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా అమెరికాలో నమోదైన కేసుల సంఖ్య 95వేలకు చేరింది. తద్వారా ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులున్న దేశంగా నిలిచింది. మరోవైపు శుక్రవారం 134 మంది మృతి చెందగా మరణాల సంఖ్య 1429కు పెరిగింది. వారం రోజుల్లోనే బాధితుల సంఖ్య పదిరెట్లు పెరిగి.. అగ్రరాజ్యాన్ని విపత్తు అంచున నిలిపింది.


శుక్రవారం అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో నిర్మానుష్యంగా మారిన ఓ రహదారి

### వారం రోజుల్లోనే అల్లకల్లోలం

వారం కిందట అమెరికాలో కరోనా పాజిటివ్ కేసులు దాదాపు 8,000 మాత్రమే. ఆ తర్వాత కేసుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వచ్చింది. దాదాపు వారం రోజుల్లోనే బాధితుల సంఖ్య 85,000 దాటింది. ఇందులో దాదాపు రెండువేల మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. అదేసమయంలో మరణాల సంఖ్య సైతం ఐదురెట్లు పెరిగింది. వారం కిందట 260 మరణాలు నమోదుకాగా, ఇప్పుడు 1,300 దాటింది. రానున్న రోజుల్లో బాధితుల సంఖ్య మరింత పెరుగుతుందని, ఇందుకు తగ్గట్టుగా ప్రభుత్వం సిద్ధంకావాలని నిపుణులు చెప్తున్నారు.

### 15 నిమిషాల్లోనే ఫలితం

కరోనా పరీక్షలో మరో ముందడుగు వేసినట్టు అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పాంపియో పేర్కొన్నారు. అబాట్ లేబొరేటరీ సంస్థ కేవలం 15 నిమిషాల్లోనే ఫలితాన్ని వెల్లడించే నూతన విధానాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. మరోవైపు భారీ సంఖ్యలో కరోనా పరీక్షలు నిర్వహించడం, వేగంగా ఫలితాలను వెల్లడించడం వల్లే కేసుల సంఖ్య పెరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనాలో ఎన్ని కేసులు ఉన్నాయో ఎవరికీ స్పష్టంగా తెలియదని విమర్శించారు. బాధితులకు చికిత్స అందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

### కేంద్రస్థానంగా న్యూయార్క్

న్యూయార్క్ నగరం కరోనాకు కేంద్రస్థానంగా మారిందని కరోనా వైరస్ టాస్క్‌ఫోర్స్ సమన్వయకర్త డెబ్రో బ్రిక్స్ పేర్కొన్నారు. కొత్త కేసుల్లో 55% అతక్కడి నుంచే వస్తున్నాయన్నారు. ఆ తర్వాతి స్థానంలో న్యూజెర్సీ ఉన్నదన్నారు. దేశంలోని 50 రాష్ట్రాల్లో.. 19 రాష్ట్రాల్లో కరోనా వ్యాప్తి తొలిదశలో ఉన్నదని ఆయన చెప్పారు.

## 5.74 లక్షల కేసులు

ప్రపంచవ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 5.74 లక్షలకు చేరింది. అమెరికా మొదటిస్థానంలో ఉండగా.. చైనా 86,454 కేసులతో రెండోస్థానంలో నిలిచింది. ఇటలీలో 80,539 కేసులు నమోదయ్యాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా మృతుల సంఖ్య 26,369కు పెరిగింది. ఇటలీలో శుక్రవారం ఒక్కరోజే 969 మంది మరణించారు. ఆ దేశంలో మరణాల సంఖ్య 8,015కు చేరుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో స్పెయిన్ (4,858), చైనా (3,292) నిలిచాయి.

### కరోనాపై ఐక్యంగా పోరాడుదాం: జిన్‌పింగ్

కరోనాపై ఐక్యంగా పోరాడుదామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అమెరికాతో మెరుగైన సంబంధాలను కోరుకుంటున్నట్లు చెప్పారు. ట్రంప్‌తో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. జిన్‌పింగ్‌తో చాలా మంచి సంభాషణ జరిగిందని, వైరను కట్టడిపై తాము చర్చించినట్లు ట్రంప్ పేర్కొన్నారు.

## తొలిసారి కరోనా చిత్రాలు

### రూపొందించిన పుణే శాస్త్రవేత్తలు

**న్యూఢిల్లీ:** కరోనా గుట్టు విప్పడంలో పుణే శాస్త్రవేత్తలు ముందడుగు వేశారు. ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ఇమేజింగ్ ద్వారా భారత్‌లో తొలిసారి ఈ వైరస్ చిత్రాలను రూపొందించారు. దేశంలో తొలి కరోనా బాధితురాలి నుంచి సేకరించిన నమూనాల ఆధారంగా వీటిని చిత్రించారు. మిడిల్‌ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్ (మెర్స్), సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్‌కు (సార్స్) తాజా కొవిడ్-19కు దగ్గరి పోలికలు ఉన్నాయని ఈ చిత్రాల ద్వారా తెలుస్తున్నదని శాస్త్రవేత్తలు తెలిపారు. కరోనా పరివర్తనాన్ని అధ్యయనం చేసేందుకు, జెనెటిక్ మూలాలు, వైరస్ ఎలా రూపాంతరం చెందుతున్నదో గుర్తించేందుకు, జంతువుల నుంచి మనుషులకు.. మనుషుల నుంచి మనుషులకు వైరస్ ఎలా సంక్రమిస్తున్నదో తెలుసుకునేందుకు ఈ చిత్రాలు ఉపయోగపడుతాయని వారు వివరించారు.


ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ ఇమేజింగ్‌లో కరోనా వైరస్ చిత్రాలు

## షిర్డీ సాయి ట్రస్ట్ విరాళం రూ.51 కోట్లు!


**షిర్డీ:** కరోనాపై పోరు కోసం షిర్డీ సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.51 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. త్వరలో ప్రభుత్వానికి ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు శుక్రవారం తెలిపింది. లాక్‌డౌన్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ప్రతిరోజు 3000 లడ్డూలు, అల్పాహారం ప్యాకెట్లు పంపిణీ చేయాలని కూడా నిర్ణయించామని పేర్కొంది. షిర్డీలో పేదలకు ఉచిత నివాసం, భోజన వసతి కల్పిస్తున్నట్లు ట్రస్ట్ సీఈఓ అరుణ్ డొంగ్రే వెల్లడించారు.

## మద్యం లభించక కూలీ ఆత్మహత్య

**త్రిసూర్:** మద్యానికి బానిసైన ఓ దినసరి కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. కేరళలోని త్రిసూర్ జిల్లాకు చెందిన సనోజ్ అనే పెయింటింగ్ కార్మికుడికి మందు తాగనిదే రోజు గడవదు. మద్యం షాపులు మూసివేయడంతో రెండు రోజులుగా మద్యం లభించలేదు. దీంతో శుక్రవారం తన ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

## కరోనాపై ముందే హెచ్చరిక!

### నిజమవుతున్న నోబెల్ గ్రహీత లెవిట్ అంచనాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కల్లోలంపై నోబెల్ పురస్కార గ్రహీత మైఖేల్ లెవిట్ ముందుగానే చెప్పిన విషయాలు ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని ఆలోచింపజేస్తున్నాయి. ముఖ్యంగా చైనాపై కరోనా ప్రభావాన్ని ముందే కచ్చితంగా అంచనా వేశారు. ఆ దేశంలో దాదాపు 80 వేల కేసులు నమోదవుతాయని, 3,250 మంది ప్రాణాలు కోల్పోవచ్చని ఊహించారు. ఆయన అంచనాలు దాదాపు నిజమయ్యాయి. మార్చి 16 నాటికి చైనాలో మొత్తం 80,298 కేసులు నమోదుకాగా, 3,245 మంది ప్రాణాలు కోల్పోయారు. మైఖేల్ చెప్పిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. కరోనాను జయించేందుకు సామాజిక దూరం పాటించడమే దివ్యౌషధమని చెప్పారు. కలిసి తిరగడానికి ఇది సరైన సమయం కాదని హెచ్చరించారు. పలు దేశాల్లో కరోనా వ్యాప్తిపై విశ్లేషణ చేసిన ఆయన.. కరోనా వ్యాప్తి రేటు తగ్గుతున్నదని తెలిపారు. సామాజిక దూరం పాటించడం వల్ల చైనా, ఇటలీ, ఇరాన్ కంటే అమెరికాలో మంచి ఫలితాలు వస్తాయన్నారు.

## మోదీ 'లాక్‌డౌన్ ప్రసంగాన్ని' వీక్షించిన 19.7 కోట్ల మంది

**న్యూఢిల్లీ:** ఇప్పటి వరకు ప్రధాని మోదీ చేసిన ప్రసంగాల్లో కరోనాని కట్టడి చేసేందుకు దేశవ్యాప్తంగా 21 రోజుల లాక్‌డౌన్ విధిస్తూ చేసిన ప్రసంగాన్ని అత్యధికులు వీక్షించారు. ఈ నెల 19న మోదీ జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ 21 రోజుల పాటు 'లాక్‌డౌన్' విధిస్తున్నట్లు చేసిన ప్రసంగాన్ని 19.7 కోట్ల మంది వీక్షించారని టెలివిజన్ రేటింగ్ ఏజెన్సీ.. బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) ఇండియా పేర్కొంది. 2016 నవంబర్ ఎనిమిదో తేదీన పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు మోదీ చేసిన ప్రకటన కన్నా లాక్‌డౌన్ ప్రసంగాన్నే ఎక్కువ మంది వీక్షించారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 29,816 | 8,660 |
| 131 | 19 |



వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

గుడ్ల ధరలు (వందకు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 335.00 | వరంగల్ | 338.00 |
| మెదక్ | 335.00 | కరీంనగర్ | 338.00 |
| రంగారెడ్డి | 335.00 | డజన్ ధర | 54.00 |

# ఈఎంఐలు కట్టక్కర్లేదు

- అన్ని టర్మ్ లోన్ల ఈఎంఐలపై మూడు నెలలు మారటోరియం
- కీలక వడ్డీరేట్లు భారీగా తగ్గింపు
- రెపోరేటు 4.4శాతానికి, రివర్స్ రెపో 4 శాతానికి కుదింపు
- వారం ముందే ఆర్బీఐ సమీక్ష

**ముంబై, మార్చి 27:** కరోనా వైరస్ కాటుతో అల్లాడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకొనేందుకు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కీలక నిర్ణయాలు తీసుకొన్నది. ఈ సంక్షోభం నుంచి సామాన్యులకు ఊరట కల్పించేలా అన్ని రకాల టర్మ్ లోన్లకు సంబంధించిన ఈఎంఐల చెల్లింపులపై మూడునెలలపాటు మారటోరియం విధించేందుకు బ్యాంకులకు, ఇతర ఆర్థిక సంస్థలకు అనుమతి ఇచ్చింది. దీనివల్ల రుణగ్రహీతల క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావమేమీ ఉండదని హామీ ఇచ్చింది. అంతేకాకుండా కీలక వడ్డీ రేట్లను గత 11 ఏండ్లలో ఎన్నడూ లేనంత భారీస్థాయిలో తగ్గించింది. రోజురోజుకూ వేగవంతంగా వ్యాప్తిచెందుతున్న కొవిడ్-19 మహమ్మారిపై పోరాడేందుకు ఆర్బీఐ తన ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాన్ని గతంలో నిర్ణయించిన షెడ్యూల్ (ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 3) కంటే వారంరోజులు ముందుగానే నిర్వహించింది. మార్కెట్లలో ద్రవ్య లభ్యతను 3.2 శాతం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించిన ఆర్బీఐ.. రెపోరేటును 75 బేసిస్ పాయింట్లు, రివర్స్ రెపోరేటును 90 పాయింట్లు చొప్పున తగ్గించింది. దీంతో ప్రస్తుతం రెపోరేటు 4.40 శాతానికి, రివర్స్ రెపోరేటు 4 శాతానికి చేరుకొన్నది. అలాగే నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్‌ను) కూడా 100 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో అది 3 శాతానికి చేరింది. 2009 జనవరి తర్వాత కీలక వడ్డీరేట్లను ఇంత భారీగా తగ్గించడం ఇదే తొలిసారి. 2004 అక్టోబర్ తర్వాత ఇవే అతితక్కువ వడ్డీరేట్లు.



### ఆర్బీఐ సమీక్షలోని ముఖ్యాంశాలు

- అన్ని రకాల రుణాల ఈఎంఐలపై మూడు నెలల మారిటోరియం
- రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రేటు 4.4 శాతానికి చేరిక
- రివర్స్ రెపోరేటు 90 బేసిస్ పాయింట్లు కోత విధించడంతో 4 శాతానికి
- 4:2 ఎంపీసీ కమిటీ సభ్యులు 75 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి ఓటువేశారు
- వివిధ మార్గాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.3.74 లక్షల కోట్లు
- సీఆర్ఆర్‌ని 1% తగ్గించడంతో మార్కెట్లోకి రూ.1.37 లక్షల కోట్లు
- కరోనా వైరస్‌తో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రస్థాయిలో ప్రభావం




**వర్కింగ్ క్యాపిటల్ లోన్లపై వడ్డీ వాయిదా**

మరోవైపు వ్యాపార వర్గాలకు ఊరట కల్పించేందుకు వర్కింగ్ క్యాపిటల్ లోన్లపై వడ్డీని మూడు నెలలపాటు వాయిదా వేయాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచించింది. ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగిన ఎంపీసీ సమావేశాల్లో పై నిర్ణయాలను తీసుకొన్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ శుక్రవారం మీడియాకు వివరించారు.

**సంక్షోభం కొనసాగితే మరింత ప్రమాదం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2019-20) మూడో త్రైమాసికం (నవంబర్-డిసెంబర్)లో 4.7 శాతానికి పతనమై ఆరేండ్ల కనిష్ఠస్థాయికి దిగజారిన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21)లో కొంతమేరకైనా పుంజుకొంటుందన్న ఆశలను కరోనా సంక్షోభం నీరుగార్చిందని ఆర్బీఐ గవర్నర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత పరిస్థితులను ఆర్బీఐ నిశితంగా పరిశీలిస్తున్నదని, దేశ ఆర్థిక స్థిరత కోసం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతామని ఆర్బీఐ తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తి, దాని తీవ్రత ఎంతకాలం కొనసాగుతుందన్న అంశాలపైనే భవిష్యత్ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణ అంచనాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలు కరోనా సంక్షోభంలో కూరుకుపోయాయని, ఇది ఇలాగే కొనసాగితే పరిస్థితులు మరింత దిగజారే అవకాశమున్నదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.




ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష



కరోనా వైరస్ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ఆర్బీఐ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నది. దీంతో ద్రవ్య లభ్యత పెరుగుతున్నది. రుణాలు చౌకగా లభిస్తాయి. ఇది మధ్య తరగతి, వ్యాపార వర్గాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

**- నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి**



దేశ ఆర్థిక స్థిరత్వానికి శక్తికాంత దాస్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నా. నెలవారి చెల్లింపులపై మూడు నెలల మారటోరియం, వడ్డీరేట్లను తగ్గించడంతో రుణాలు తీసుకున్నవారికి భారీ ఊరట లభించనున్నది. తగ్గించిన వడ్డీ రేట్లు వెంటనే అమల్లోకి రావాలి

**- నిర్మతా సీతారామన్**

కీలక వడ్డీరేట్లను రేటును తగ్గిస్తూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. ఈఎంఐలపై ఇచ్చిన మారటోరియం అస్పష్టంగా, అర్థరహితంగా ఉన్నది.

**- చిదంబరం, మాజీ కేంద్ర మంత్రి**

కరోనా వైరస్‌తో దిగాలు పడుతున్న ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి ఆర్బీఐ బోల్డ్‌గా నిర్ణయాలు తీసుకున్నది. దీంతో మార్కెట్లో నగదు లభ్యత పెరుగడంతోపాటు ఆర్థిక మార్కెట్లలో స్థిరత్వం రానున్నది.

**- రజనీశ్ కుమార్, ఎస్బీఐ చైర్మన్**

పడకేసిన ఆర్థిక, ఫైనాన్షియల్ మార్కెట్లు ఈ ఉద్దీపన ప్యాకేజీతో మళ్లీ తేరుకునే అవకాశాలున్నాయి. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిలో పడేందుకు ఆస్కారం ఉన్నది''

**- సంగీతా రెడ్డి, ఫిక్కీ ప్రెసిడెంట్**

మూడు నెలలపాటు ఈఎంఐలపై మారటోరియం విధించడంతో ప్రజలకు, మరోవైపు వ్యాపారవేత్తలకు భారీ ఊరట లభించినట్లు అయింది.

**- పీయూష్ గోయల్, కేంద్ర వాణిజ్య మంత్రి**

## మారటోరియం అంటే..



బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకొన్న రుణాలను సదరు రుణగ్రహీతలు వడ్డీతో కలిపి ఈఎంఐల రూపంలో తిరిగి చెల్లిస్తుంటారు. వీటిని కొంతకాలంపాటు చెల్లించాల్సిన అవసరంలేకుండా రుణగ్రహీతలకు వెసులుబాటు కల్పించే వ్యవధినే మారటోరియం పీరియడ్ లేదా 'ఈఎంఐ హాలిడే' అంటారు. సాధారణ సమయాల్లో ఈఎంఐల చెల్లింపు ఆలస్యమైతే సదరు రుణగ్రహీతలను ఎగవేతదారులుగా పరిగణిస్తారు. అంతేకాకుండా వారి క్రెడిట్ హిస్టరీ (సిబిల్ స్కోర్)పై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో ముున్ముందు రుణాలను పొందడంలో వారికి ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ ప్రస్తుతం నిర్దేశించిన మారటోరియం పీరియడ్‌లో ఈఎంఐల చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సదరు రుణగ్రహీతలను ఎగవేతదారులుగా పరిగణించకూడదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఈఎంఐల చెల్లింపుల్లో జాప్యం జరిగినా రుణగ్రహీతల క్రెడిట్ హిస్టరీ (సిబిల్ స్కోర్)పై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. అయితే క్యాష్ క్రెడిట్/ఓవర్‌డ్రాఫ్ట్ రూపంలో మంజూరుచేసిన మూలధన రుణాలపై ఈ మూడు నెలలపాటు వడ్డీ విధింపును యథాతథంగా కొనసాగించవచ్చని, ఈ విధంగా పేరుకుపోయిన వడ్డీని మారటోరియం పీరియడ్ ముగిసిన వెంటనే రుణదాతలు వసూలుచేసుకోవచ్చని శుక్రవారం విడుదల చేసిన సర్క్యులర్‌లో ఆర్బీఐ వివరించింది.

## మాంద్యంలోకి ఆర్థికం..!

- **ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా హెచ్చరిక**

**వాషింగ్టన్, మార్చి 27:** కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టలినా జార్జివా హెచ్చరించారు. ఈ వైరస్ నుంచి గట్టెక్కాలంటే భారీగా నిధులు అవసరమని, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉదారంగా సహాయ సహకారాలు అందించాలని ఆమె సూచించారు. 2009లో వచ్చిన సంక్షోభం కంటే ఇది అతిపెద్ద సంక్షోభమని ఆమె వ్యాఖ్యానించారు. ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే అత్యవసరంగా 2.5 లక్షల కోట్ల డాలర్ల నిధులు అవసరమని వ్యాఖ్యానించిన ఆమె.. ఇప్పటికే ఈ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి 83 బిలియన్ డాలర్ల మేర ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తక్కువ ఆదాయం కలిగిన 80 దేశాలను ఐఎంఎఫ్ అన్ని రకాలుగా ఆదుకుంటున్నదని, ఆయా దేశాల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నదో గుర్తించడం కష్టతరంగా మారిందని వ్యాఖ్యానించారు. ఈ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి అమెరికా 2.2 ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ప్రకటించడాన్ని ఆమె స్వాగతించారు.

## పక్షం రోజుల్లో 53 వేల కోట్లు

### బ్యాంకుల నుంచి నగదును ఉపసంహరించుకున్న డిపాజిటర్లు

**ముంబై, మార్చి 27:** కరోనా వైరస్ ఎవ్వరీ్న వదలడంలేదు. దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితులు నెలకొనడంతో బ్యాంక్ ఖాతాదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంకుల నుంచి డిపాజిటర్లు రూ.53 వేల కోట్ల నగదును ఉపసంహరించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ వచ్చే నెల చివరినాటికి పొడిగించడంతో డబ్బులకు కొరత ఉంటుందన్న భయాలు వారిలో స్పష్టంగా కనిపించాయి. దీంతో ఈ నెల 13తో ముగిసిన తొలి పక్షం రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నిధుల్లో రూ.53 వేల కోట్ల నిధులను ఉపసంహరించుకున్నారని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.



**ప్రజల వద్ద రూ.23 లక్షల కోట్ల నగదు**

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంలేదు. భారతీయులు కరెన్సీ రూపంలోనే అత్యధికంగా లావాదేవీలు జరుపుతున్నారని ఆర్బీఐ నివేదిక స్పష్టంచేసింది. ఈ నెల 13 నాటికి ప్రజల వద్ద రూ.23 లక్షల కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని పేర్కొంది. ముందస్తు చర్యల్లో భాగంగా బ్యాంకుల శాఖలు, ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ కష్టమవుతున్నదన్న అంచనాతో అత్యధిక మంది నగదును ఉపసంహరించుకున్నారని యాక్సిస్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త సుగాటా భట్టచార్య తెలిపారు.

## శాఖల మూసివేత వదంతులే

- **డీఎఫ్ఎస్ కార్యదర్శి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, మార్చి 27:** బ్యాంక్ శాఖలను మూసివేస్తున్నట్లు వచ్చిన వార్తలను ఆర్థిక సేవల కార్యదర్శి దేబాశిస్ పాండా కొట్టిపారేశారు. లాక్‌డౌన్‌లోనూ ప్రత్యేక సర్వీసులను అందిస్తున్నామని, బ్యాంకుల, ఏటీఎంలలో నగదు కొరత లేదని ఆయన స్పష్టంచేశారు. మరోవైపు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ) కూడా ఈ పుకార్లను కొట్టిపారేసింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం లక్షకు పైగా శాఖల్లో నగదు డిపాజిట్లు, ఉపసంహరణ, చెక్కుల క్లియరెన్స్, రెమిటెన్స్, ప్రభుత్వ లావాదేవీలు యథాతథంగా జరుగుతున్నాయి.

## ఎస్బీఐ షురూ

### వడ్డీరేట్లు 75 బేసిస్ పాయింట్లు తగ్గింపు

**ముంబై:** రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన కొన్ని గంటల్లోనే దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)..వడ్డీరేట్లను ఏకంగా 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతోపాటు రిటైల్, బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను కూడా 20 బేసిస్ పాయింట్ల నుంచి 100 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించింది. ఈ నిర్ణయంతో ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్-లింక్డ్ లెండింగ్ రేటు(ఈబీఆర్), రెపో-లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమై అన్ని రకాల రుణాలపై వడ్డీరేటు మరింత తగ్గనున్నదని తెలిపింది. దీంతో ఈబీఆర్ రేటు 7.80 శాతం నుంచి 7.05 శాతానికి తగ్గనుండగా, ఆర్ఎల్ఎల్ఆర్ 7.40 శాతం నుంచి 6.65 శాతానికి దిగిరానున్నది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో 30 ఏండ్ల కాలపరిమితి కలిగిన లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ రూ.52 తగ్గనున్నది. మరోవైపు బ్యాంక్ అసెట్ లయబిలిటీ కమిటీ వచ్చే నెలలో సమావేశమై మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు తగ్గింపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు కుమార్ వెల్లడించారు.

**60 వేల కోట్ల చెల్లింపులపై ప్రభావం**

ఆర్బీఐ తీసుకున్న మూడు నెలల మారటోరియంతో బ్యాంకుకు రావాల్సిన మొత్తం రుణాల్లో రూ.50 వేల నుంచి రూ.60 వేల కోట్ల వరకు చెల్లింపులు నిలిచిపోనున్నట్లు ఎస్బీఐ స్పష్టంచేసింది. ప్రతియేటా రూ.2-2.5 లక్షల కోట్ల వరకు రుణాలను వసూలు చేస్తుండగా, వీటిలో వచ్చే మూడు నెలల్లో రూ.60 వేల కోట్ల వరకు వసూలు కాకపోవచ్చునని బ్యాంక్ చైర్మన్ రజనీశ్ కుమార్ చెప్పారు.

**బ్యాంకులు తగ్గించింది స్వల్పమే..!**

ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి రిజర్వు బ్యాంక్ ఉదారంగా వడ్డీరేట్లను తగ్గిస్తున్నప్పటికీ బ్యాంకులు మాత్రం పెడచెవిన పెడుతున్నాయి. 2019లో వరుసగా ఐదుసార్లు 135 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్లను తగ్గిస్తే బ్యాంకులు మాత్రం 35-40 బేసిస్ పాయింట్లు తగ్గించి చేతులు జులుపుకున్నాయి. కానీ, ఈసారి కరోనా వైరస్‌తో కుదేలవుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టడానికి సెంట్రల్ బ్యాంక్ ఏకంగా 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంకులు ఏ మేరకు తగ్గిస్తాయో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరుకున్న కారణంగా డిసెంబర్, ఫిబ్రవరి నెలల్లో జరిగిన సమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది.

## మార్కెట్లలోకి 3.74 లక్షల కోట్లు

కొవిడ్-19 సంక్షోభం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో ఒత్తిడి పెరిగిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.3.74 లక్షల కోట్లు చొప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని శక్తికాంతదాస్ తెలిపారు. టార్గెటెడ్ లాంగ్ టర్మ్ రెపో ఆపరేషన్ (టీఎల్టీఆర్వో)తోపాటు నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్‌ను) తగ్గించడం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్)ని 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడం ద్వారా ఈ నిధులను బ్యాంకుల్లో చొప్పించనున్నట్టు ఆయన వివరించారు. దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని, ప్రైవేట్ బ్యాంకుల్లోనూ ఖాతాదారుల సొమ్ము భద్రంగా ఉన్నదని చెప్పారు. నగదు ఉపసంహరణల (క్యాష్ విత్‌డ్రాయల్స్) విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికావలసిన అవసరంలేదని భరోసా ఇచ్చారు. గత నెలలో నిర్వహించిన విధాన సమీక్ష తర్వాత మార్కెట్లోకి దాదాపు రూ.2.7 లక్షల కోట్లు విడుదల చేశామని ఆయన చెప్పారు.


## ఆట

## సచిన్ 50 లక్షల విరాళం



**న్యూఢిల్లీ:** విశ్వమారి కరోనా వైరస్‌పై పోరాటంలో క్రీడాకారులు తమ వంతు పాత్ర పోషిస్తూనే ఉన్నారు. ఇప్పటికే పలువురు ప్లేయర్లు తమ వంతు సాయం ప్రకటించగా, తాజాగా భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రూ.50 లక్షల విరాళం శుక్రవారం ప్రకటించాడు. ఇందులో రూ.25 లక్షలు ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్‌కు విరాళమిచ్చిన మాస్టర్ మరో రూ.25 లక్షలు సొంత రాష్ట్రం మహారాష్ట్ర సీఎంఆర్ఎఫ్‌కు ఇస్తున్నట్లు పేర్కొన్నాడు. సోషల్‌మీడియా ట్విట్టర్ వేదికగా సచిన్ మాట్లాడుతూ 'దేశంలో కరోనా వైరస్‌తో బాధపడుతున్న వ్యక్తుల పట్ల మిగతావారు సహృదయతను చాటాలి. అంతేకానీ వారిపై వివక్షను ప్రదర్శించవద్దు. ఒక సమాజంగా వారిని కాపాడుకోవడం మన బాధ్యత' అని సచిన్ తన వీడియో సందేశంలో చెప్పుకొచ్చాడు. ఇప్పటి వరకు పలువురు క్రీడాకారులు ప్రకటించిన విరాళాల్లో సచిన్‌దే అగ్రస్థానం.

## జొకోవిచ్ భారీ వితరణ



**బెల్‌గ్రేడ్:** ప్రపంచ టెన్నిస్ నంబర్‌వన్ నోవాక్ జొకోవిచ్ తన సహృదయతను చాటుకున్నాడు. ప్రమాదకర కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు కావాల్సిన వైద్య పరికరాల కోసం 1.1 మిలియన్ డాలర్లు(రూ.8.28 కోట్లు) భారీ విరాళాన్ని ప్రకటించాడు.సెర్బియాలో లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రస్తుతం తన కుటుంబసభ్యులతో కలిసి మార్బెల్లాలో గడుపుతున్న జొకో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడాడు. 'కరోనా బారిన పడిన వారి జీవితాలను కాపాడే వెంటిలేటర్లు, సానిటరీ పరికరాల కోసం ఈ విరాళమిస్తున్నాను. సెర్బియాతో పాటు ప్రపంచంలో కరోనాతో బాధపడుతున్న వారికి సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని అన్నాడు.

## లాక్‌డౌన్‌లో లాఠీలు పట్టి

### పోలీసు విధుల్లో క్రీడాకారులు



జోగిందర్ సింగ్ | అఖిల్ కుమార్ | అజయ్ ఠాకూర్

తాము ఎంచుకున్న క్రీడల్లోనే కాదు సామాజిక బాధ్యతలో కీలకమైన పోలీసు విధుల్లోనూ వారు సత్తాచాటుతున్నారు. దేశం గర్వించే రీతిలో రాణించిన వారు భద్రతలో తమ వంతు బాధ్యతలు నిర్వర్తిస్తు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు అనుసంధానంగా ఉంటూ కీలకమైన విధుల్లో వాళ్లు మరెవరో కాదు జోగిందర్‌సింగ్, అఖిల్ కుమార్, అజయ్ ఠాకూర్.

**న్యూఢిల్లీ:** దేశం యావత్తు లాక్‌డౌన్ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణాన వైద్యులు, పోలీసులు, జర్నలిస్టులు, శానిటేషన్ సిబ్బంది ప్రాణాలను పణంగా పెడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరూ చేస్తున్న సేవలకు తామంతా రుణపడి ఉన్నామంటూ సంఘీభావం ప్రకటిస్తున్నారు. ఇదంతా ఎందుకు చెప్పవలిసి వస్తుందంటే గతంలో తమదైన ఆటతీరుతో జాతి మొత్తం గర్వపడేలా చేసిన జోగిందర్ సింగ్, అఖిల్ కుమార్, అజయ్ ఠాకూర్ ప్రస్తుతం పోలీసులుగా కీలక విధుల్లో ఉన్నారు. కొవిడ్-19తో దేశం పోరాడుతున్న క్షణాన కంటిమీద కునుకులేకుండా డ్యూటీలు చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఈ సందర్భంగా పోలీసులుగా తమ విధులేంటో మీడియాతో పంచుకున్నారు. 2007లో టీ20 ప్రపంచకప్ టోర్నీని భారత్ తొలిసారి గెలువడంలో కీలకమైన ఆల్‌రౌండర్ జోగిందర్‌సింగ్ ప్రస్తుతం హర్యానాలోని హిసార్‌లో డీఎస్పీగా పనిచేస్తున్నాడు. '2007 నుంచి నేను డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ప్రస్తుత తరుణంలో కొవిడ్-19ను ఎదుర్కొనేందుకు సవాలుతో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాను. ఇన్నేండ్ల నా సర్వీసులో ఎన్నో చాలెంజ్‌లు చూశాను. కరోనా వైరస్ ప్రభావాన్ని తెలుసుకుంటూ ఇప్పుడిప్పుడే ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తగా ఉంటున్నారు. మరికొందరేమో పరిస్థితి అర్థం చేసుకోకుండా వీధుల్లోకి వస్తున్నారు. వారి పట్ల మేము కఠినంగా వ్యవహరిస్తున్నాం'అని శర్మ అన్నాడు. మరోవైపు గురుగ్రామ్ ఎసీపీగా ఉన్న అఖిల్ మాట్లాడుతూ 'ప్రజలు మాకు పూర్తిగా సహకరిస్తున్నాను. అత్యవసర సేవలు కొనసాగిస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు లేవు. కఠినమైన నిబంధనలు కొనసాగించినప్పుడే కరోనా వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనగల్గుతాం' అని అన్నాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో డీఎస్పీగా వ్యవహరిస్తున్న స్టార్ కబడ్డీ ప్లేయర్ అజయ్ ఠాకూర్..బిలాస్‌పూర్‌లో పెట్రోలింగ్ విధుల్లో బిజీగా గడుపుతున్నాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఇలా పోలీసు అధికారులుగా కీలకమైన బాధ్యతలతో మిగతా క్రీడాకారులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

## ఇది మామూలు యుద్ధం కాదు




**ముంబై:** కరోనా వైరస్ మహమ్మారిని ఎదుర్కొవాలంటే లాక్‌డౌన్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. కరోనాపై యుద్ధం సాధారణ విషయం కాదని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ సూచనలు పాటించాలని దేశ ప్రజలకు విరాట్ సందేశమిచ్చాడు. ' ఈ రోజు నేను టీమ్ ఇండియా ఆటగాడిగా కాదు.. దేశ పౌరుడిగా మాట్లాడుతున్నా. కొద్ది రోజులుగా చూస్తున్నా.. కొన్ని చోట్ల ప్రజలు గుంపులుగా తిరుగుతున్నారు. కర్ఫ్యూను, లాక్‌డౌన్ నిబంధనలను సరిగ్గా పాటించడం లేదు. దీన్ని బట్టి మనం కరోనా వైరస్‌ను తేలికగా తీసుకుంటున్నట్లు కనబడుతున్నది. కానీ కరోనాతో యుద్ధం అంత సులువైంది కాదు. అందుకే ప్రతి ఒక్కరు నిర్ణీత దూరం పాటించాలని కోరుతున్నాను. త్వరలో పరిస్థితులు మెరుగుపడాలని కోరుకుంటున్నా, జైహింద్' అని ట్విట్టర్ వీడియోలో అన్నాడు.

పోలీసులపై దాడి చేస్తారా..?

## భజ్జీ గుస్సా



**ముంబై:** లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని చెప్పిన పోలీసుల మీద.. దాడికి పాల్పడిన వారిపై టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందరి కోసం జీవితాలను పణంగా పెట్టి పోలీసులు పని చేస్తున్నారని, వారిని ప్రతిఘటించడమేంటని ప్రశ్నించాడు. ఈ సందర్భంగా పోలీసులపై కొందరు దాడి చేసిన ఓ వీడియోను ట్విట్టర్లో పోస్ట్ చేశాడు. 'పోలీసుల పట్ల మన ఆలోచనాతీరు, ప్రవర్తన మారాలి. ప్రాణాలను పణంగా పెట్టి వారు మన జీవితాలను కాపాడేందుకు పని చేస్తున్నారని మరువకూడదు. వారికి కూడా కుటుంబాలు ఉన్నాయి. కానీ వారు దేశం కోసం విధులు నిర్వర్తిస్తున్నారు. మంచి భవిష్యత్తు కోసం ఎందుకు ఇండ్లలో ఉండకూడదు.. దయచేసి సక్రమంగా ఉండండి' అని హర్భజన్ సింగ్ ట్వీట్ చేశాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## సామాజిక దూరాన్ని పాటించాలి

- ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మెదక్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ: ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటించి కరోనా కట్టడికి సహకరించాలని ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డితో కలిసి కరోనా వైరస్ నివారణపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు 125మందిని క్వారంటైన్‌లో ఉంచినట్టు తెలిపారు. అనంతరం రామాయంపేటలో కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు.



ఖమ్మం గాంధీనగర్‌లో కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

## స్వీయ నిర్బంధమే మేలు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌ను ఎదుర్కొవాలంటే ప్రజలంతా స్వీయ నిర్బంధం పాటించడమే మేలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి ఖమ్మం నగరంలోని సూపర్‌మార్కెట్లు, కిరాణషాపులు, కూరగాయల మార్కెట్లను పరిశీలించారు. అనంతరం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన మంత్రి వ్యాపారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు.



నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి అల్లోల

## ఇంటికే పరిమితం కావాలి

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలంతా ఇండ్లకే పరిమితం కావాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే ప్రజలు బయటకు వచ్చి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయాలని మంత్రి వారికి సూచించారు.



# అన్నార్తులకు అమ్మలా..

## మాజీ ఎంపీ కవిత చొరవతో లాక్‌డౌన్ సమయంలోనూ నిత్యాన్నదానం



శుక్రవారం నిజామాబాద్ జిల్లాకేంద్ర దవాఖానలో కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమం

- రోజుకు 2 వేల మందికి..
- నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ప్రభుత్వ దవాఖానల్లో అన్నదానం

నిజామాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి:

అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదంటారు.. కానీ పేదల ఆకలిబాధలు గుర్తెరిగి వారి కడుపు నింపుతున్నారు నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత. ఎంపీగా ఉన్న సమయంలోనే ఆమె తన సొంత డబ్బుతో స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు రెండున్నరేండ్లుగా ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నది. తాజాగా కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే నేపథ్యంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో బయట హోటళ్లు అన్ని మూతపడ్డాయి. దీంతో దవాఖానలోని ఈ నిత్యాన్నదానమే ప్రస్తుతం పేదల కడుపు నింపుతున్నది. మధ్యాహ్నం అయిందంటే చాలు భోజనం సిద్ధంగా ఉంటున్నది. ఆకలితో ఉన్న వారంతా ఈ కేంద్రానికి వచ్చి కడుపు నిండా తిని కవితను ఆశీర్వదిస్తున్నారు. గత ఆదివారం జనతా కర్ఫ్యూ పాటించిన రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఆ ఒక్కరోజుకే దవాఖానకు వచ్చిన నిరుపేదలు ఆకలితో అలమటించారు. బయటకు వెళ్తే ఎక్కడా హోటళ్లు లేవు. ఈ పరిస్థితిని గమనించిన నిజామాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి వెంటనే మాజీ ఎంపీ కవితతో ఫోన్‌లో మాట్లాడారు. నిత్యన్నదాన కార్యక్రమం ఎంతో మంది కడుపునింపుతున్నదని, ఒక్క రోజు లేనందుకే వారు విలవిల్లాడిపోయారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనతా కర్ఫ్యూ కారణంగానే ఆ రోజు ఏర్పాటు చేయలేకపోయామని.. నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నదని ఆమె కలెక్టర్‌కు వివరించారు.

**మరికొన్ని చోట్లా..**

నిజామాబాద్ జిల్లాకేంద్ర దవాఖానలో ప్రారంభించిన తరువాత బోధన్, ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానల్లోనూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు కవిత. అంతటితో ఆగకుండా జిల్లా సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేయించారు. ఇలా రోజుకు రెండు వేల మంది వరకు నిత్యాన్నదానం ద్వారా ఆదుకుంటున్న కవితకు పేదలు చేతులెత్తి దండం పెడుతున్నారు.

### పేదల ఆకలి తీరుస్తున్నారు..



నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో 2017 నవంబర్ 8న నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అప్పటినుంచి నిర్విరామంగా కొనసాగుతున్నది. అప్పడప్పుడు ఔట్ పేషెంట్లు కూడా వచ్చి తింటారు. బయట నుంచి నిరుపేదలు వచ్చి ఆకలి తీర్చుకుంటారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇలాంటి వసతి ఇప్పుడు ఎంతోమందికి ఉపయోగపడుతున్నది. కల్వకుంట్ల కవిత కృషితోనే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– అవంతి రావు, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు

### గావరొచ్చి పడిపోయేటోళ్లం



దవాఖానల బువ్వ పెట్టని రోజుల్లో బయటకెళ్లి తినాలంటే బాగా పైసలయ్యేటివి. మా దగ్గర పైసలు లేక అట్లనే ఆకలితో ఉండేటోళ్లం. గావరొచ్చి పడిపోయేటోళ్లం. ఇప్పుడు టైమును పెడుతున్నారు. కవితక్క సల్లగుండాలె.

– గంగామణి, నిజాంపూర్, (నవీపేట్)

### కవితమ్మను మరువం..



రోగులవెంట వచ్చిన వారికి పైసలు తీసుకోకుండా అన్నం పెట్టడం ఎంతో మంచిగున్నది. కవితమ్మ వందేండ్లు సల్లంగా ఉండాలి. నా కొడుకు ధన్‌రాజ్‌కు అపెండిక్స్ వస్తే ఇక్కడికొచ్చినం. ఈడనే రోజూ తింటున్న. టైమ్‌కు బువ్వ పెడుతుండ్రు.

– మీరిబాయి, బాన్సువాడ

### ఆమె సల్లంగుండాలి..



కవితక్క భోజనం పెట్టిస్తున్నదని ఈడికొచ్చినంక తెలిసింది. ఆమె కడుపు సల్లగుండ. పేదోళ్ల కోసం ఇట్ల ఆలోచించేటోళ్లు ఉండాలె. ఈ కష్టకాలంలో బయటకు పోతే చాయ్‌బొట్టు కూడా దొరకతలేదు. అన్నం లేకుంటే ఆగమయ్యేటోళ్లం.

– లలిత, వడ్డేపల్లి, ఎడపల్లి



రాజవ్వ మృతదేహాన్ని చెత్తరిక్షాలో శ్మశాన వాటికకు తరలిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు.. (ఇన్‌సెట్‌లో) కోసరి రాజవ్వ (ఫైల్)

# చెత్తరిక్షాలో అంతిమయాత్ర

- అనారోగ్యంతో వృద్ధురాలి మృతి
- కరోనా భయంతో బంధువులు దూరం
- అంత్యక్రియలు నిర్వహించిన పంచాయతీ సిబ్బంది

ధర్మారం: కరోనా మహమ్మారి బంధుత్వాలను దూరం చేస్తున్నది. మనిషి చనిపోయినా దగ్గరికి రానివ్వట్లేదు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలో ఓ వృద్ధురాలి మృతి కరోనా భయం తీవ్రతకు అద్దం పట్టింది. గ్రామానికి చెందిన కోసరి అంజయ్య(60), రాజవ్వ(56) దంపతులు. వీరికి సంతానం లేరు. రెండు నెలల కిందట అంజయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో రాజవ్వ కొద్దిరోజులు ఇల్లు వదిలి గ్రామంలోనే వేరే ఇంట్లో అద్దెకు ఉంటున్నది. భర్త మృతితో కుంగిపోయిన రాజవ్వ కూడా దిగులుతో మంచంపట్టింది. గురువారం సాయంత్రం ఇంట్లోనే మృతిచెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు శుక్రవారం బంధువులకు సమాచారం ఇచ్చారు. కరోనా భయంతో ఎవరూ రాలేదు. చాలా సేపు వేచి చూసినా అంతిమ వీడ్కోలుకు ఒక్కరూ రాకపోవడంతో పంచాయతీ పాలకవర్గం స్పందించింది. సర్పంచ్ జానకి, ఉప సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ మిట్ట రమేశ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ సలామొద్దీన్ తదితరులు పంచాయతీ సిబ్బంది సాయంతో రాజవ్వ మృతదేహాన్ని రిక్షాలో శ్మశాన వాటికకు తరలించారు. అన్ని తామై అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

### ✦ కరోనాను కట్టడి చేద్దాం



కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం పటిష్ట చర్యలను చేపట్టి అమలు చేస్తున్నదని గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం ములుగులో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, ఎమ్మెల్యే సీతక్కతో కలిసి ఏరియా దవాఖానను సందర్శించారు. దవాఖానాలో చికిత్స పొందుతున్న పలువురిని మంత్రి పరామర్శించారు.

– ములుగు ప్రతినిధి, నమస్తే తెలంగాణ

### ✦ పరిమళించిన మానవత్వం



బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మూర్ఛతో కిందపడిపోవడంతో మున్సిపల్ అధికారులు దవాఖానకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. జగిత్యాలకు చెందిన రాజేశ్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. లాక్‌డౌన్ నేపథ్యంలో మంచిర్యాలకు చెందిన స్నేహితుడితో కలిసి జగిత్యాలకు వెళ్తున్నాడు. సిరిసిల్ల పాతబస్టాండ్ వద్దకు చేరుకోగానే మూర్ఛ రావడంతో కిందపడగా తలకు గాయమైంది. కరోనా భయంతో అతడికి సాయం చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అక్కడే ఉన్న మున్సిపల్ డీఈఈ వెంకటశేషయ్య, మేనేజర్ విజయ్‌కుమార్ వాహనంలో బాధితుడిని జిల్లా దవాఖానకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

– సిరిసిల్ల టౌన్

### ✦ స్వచ్ఛ'శిక్ష'



లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చిన వారికి పోలీసులు దండన విధిస్తున్నారు. శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు బైకులపై, కార్లలో పరిమితికి మించి రోడ్లపైకి వచ్చారు. స్థానిక రాజీవ్ చౌరస్తాలో అడ్డగించిన సీఐ సూర్యనాయక్, పట్టణ ఎస్సై వెంకటేశ్‌గౌడ్‌లు.. వారితో రోడ్లను ఊడ్పించారు.

– వనపర్తి టౌన్

# సరిహద్దుల్లో అడ్డగింతలు

- నిజామాబాద్ సరిహద్దులో 64 మంది నిలిపివేత
- గద్వాల జిల్లాలో ఇరాన్ వాసులకు కరోనా పరీక్షలు



నిజామాబాద్ జిల్లా సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారుల అదుపులో ఉన్న మహారాష్ట్ర నుంచి ప్రవేశించిన యువకులు

బోధన్, నమస్తే తెలంగాణ/ఉండవల్లి: లాక్‌డౌన్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దుల్లోకి ప్రవేశించిన వారిని పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం పలుచోట్ల అడ్డుకొని కరోనా పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర వద్ద తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో శుక్రవారం ఉదయం మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున యువకులు రాష్ట్రంలోకి ప్రవేశించారు. వీరంతా మంజీర నదిని దాటి పొలాలు, చేలల్లో నడుస్తూ సాలూర క్యాంప్, నాగన్‌పల్లి గ్రామాల వద్ద రోడ్డుపైకి చేరుకున్నారు. మహారాష్ట్రలోని పర్భణి జిల్లాలో పనిచేస్తున్న 61మంది యువకులు, మహారాష్ట్రలోని బారామతిలో అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న మరో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రంలోకి ప్రవేశించారు. సమాచారం అందుకున్న అధికార సదరు 64 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించారు. బోధన్ ఆర్డీవో గోపీరాం, ఏసీపీ జైపాల్‌రెడ్డి, తాసిల్దార్ గఫార్‌మియా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య అక్కడికి చేరుకొని వారి వివరాలు సేకరించారు. వీరిలో బారామతిలో అగ్రికల్చరల్ బీఎస్సీ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు, ఒక విద్యార్థి ఉన్నారు. సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఆ ఇద్దరు అమ్మాయిలను, జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని వారి తల్లిదండ్రులు సాలూరకు రావడంతో అప్పగించారు. కాగా, మిగతా 61 మంది యువకులు మాత్రం అక్కడే ఉన్నారు. వారు వచ్చిన ప్రదేశానికి తిప్పి పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి చేతులపై క్వారంటైన్ ముద్రలు వేశారు.

**గద్వాల జిల్లాలో ఇరాన్ దేశస్థులు..**

ఇరాన్‌కు చెందిన నలుగురు టూరిస్టులకు శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద అధికారులు కరోనా పరీక్షలు నిర్వహించారు. భారత్‌లో సందర్శించేందుకు 3 నెలలక్రితం నలుగురు వ్యక్తులు వచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లేందుకు కర్నూలు నుంచి హైదరాబాద్ బయలుదేరారు. ఈ క్రమంలో పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వారికి డీఎంహెచ్‌వో సునీత ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి వారికి వైరస్ లక్షణాలు లేవని నిర్ధారించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు వారిని రాష్ట్రంలోకి అనుమతించమని డీఎంహెచ్‌వో తెలిపారు.

### మీ ప్రాణాలకు మా ప్రాణాలు అడ్డేస్తాం

**మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ: ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలనైనా పణంగా పెడతామని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు స్వీయనిర్బంధం పాటించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. అనాథలకు రోజూ అన్నం పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, నిత్యం వెయ్యిమందికి భోజనం అందిస్తామని స్పష్టంచేశారు. చదువుకున్న కొందరు పైశాచిక ఆనందంతో కరోనాపై తీసుకుంటున్న చర్యలపై టిక్‌టాక్‌లో విమర్శలు చేస్తున్నారని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

### ✦ వాట్సాప్‌లో ఎడ్ల బేరం..



కరోనా దెబ్బకు అంగళ్లు బంద్ కావడంతో ఓ పశువుల వ్యాపారి వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామాంజపురానికి చెందిన చిలుకూరి వెంకన్న తన వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న పశువుల ఫొటోలను వాట్సాప్‌లో పోస్ట్ చేశాడు. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

– శాలిగౌరారం

28032020-DIS-10_Layout 1 3/28/2020 1:11 AM Page 1




## మ్యాచింగ్ మాస్కులు..



కరోనా ఎఫెక్ట్‌తో మాస్కులు లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. ఈ అవకాశాన్ని వృథా చేసుకోకుండా ఫ్యాషనిస్టులు తమ మెదడుకు పదును పెడుతున్నారు. అందులోంచి పుట్టుకొచ్చిందే ... ఈ జిగేలుమనే కొత్తరకం మాస్క్. ముఖ్యంగా రేపటి పరిస్థితి గురించి ఆలోచించి.. 'పెండ్లి కూతుళ్ల కోసమే ఈ స్పెషల్ మాస్కులు' అంటూ కొత్తరకం ప్రచారం నడుస్తున్నది. ఇండియా, పాకిస్తాన్‌లలో ఈ ట్రెండ్ మరింత ఊపు మీద ఉంది. కొందరైతే మామూలు మాస్కుల మీద కరోనా వైరస్‌కి సంబంధించిన బొమ్మలను పెట్టి మరీ, మ్యాచింగ్ మాస్కులను తయారు చేయడం విశేషం. ఇప్పటికే వీటి అమ్మకాలూ బాగున్నాయట.

# మానసిక కరోనా





ప్రస్తుత నిర్బంధ పరిస్థితుల్లో 'సామాజిక ఆరోగ్యం' దెబ్బతింటున్నది. బయటికి వెళ్లలేరు. నలుగురితో కలవలేరు. సినిమాలు, పార్కుల ద్వారా లభించే రిలాక్సేషన్ కూడా ఉండదు. దీంతో మానసిక సాంత్వన కొరవడుతుంది. మనసు బలహీనమై రోగనిరోధకశక్తి తగ్గుతుంది. ఫలితంగా, కరోనా ఇన్‌ఫెక్షన్ ప్రమాదం మరింత పెరుగుతుంది.



**బయట కనిపించే మనుషులను చూస్తే భయం.. కూరగాయలు తీసుకొచ్చిన నాన్నను చూస్తే భయం.. ఎదురు ఫ్లాట్‌లో ఉన్న డాక్టర్‌ను చూస్తే భయం.. పక్కింటి ఆంటీ తన బిడ్డను ఎత్తుకుంటానంటే భయం! ఒకప్పుడు ఆత్మీయుల్లా అనిపించిన వాళ్లంతా హఠాత్తుగా యమభటుల్లా కనిపిస్తారు. ఎవరు ఎవరి ద్వారా వైరస్ అంటించుకున్నారో తెలియని అయోమయం. కంటికి కనిపించని శత్రువు తనపై ఎప్పుడు, ఏ రూపంలో దాడి చేస్తుందో అర్థంకాని అభద్రత. ఒకవైపు ప్రధాన మీడియా.. మరోవైపు సోషల్ మీడియా.. ఇంకోవైపు వాట్సప్ మెసేజ్‌లు... అంతటా అదే చర్చ. నిరంతరం ఏదో హార్రర్ మూవీ చూస్తున్నట్టు... ఏ క్రిమినలో మన ముందుకు వచ్చి కత్తి దూస్తున్నట్టు... అనుక్షణం ఆందోళనతో బతుకుతున్నాం. ఇలాంటి మితిమీరిన భయాల నుంచి బయటపడాలంటే ఏం చేయాలి?**

... రచన ముడుంబై

**ఇప్పుడు,** ఎక్కడ చూసినా కరోనా జపమే. ప్రపంచాన్నంతా వణికిస్తున్న ఘోర విపత్తు ఇది. మన మెదడుకు ఎంత సూపర్ పవర్ ఉన్నా... ఇలా ఉప్పెనలా విరుచుకుపడే విపత్తులను తట్టుకోగలిగే శక్తి మాత్రం లేదు. దానికి తోడు మన ముందున్న శత్రువు పట్ల మనకే పూర్తి స్పష్టత లేని పరిస్థితి. అందుకే కరోనా విషయంలో ఇన్ని భయాందోళనలు! ఇలాంటి తీవ్ర ఒత్తిడి.. మెదడులో అలజడిని సృష్టించి, శరీరాన్నంతటినీ అతలాకుతలం చేస్తుందని హెచ్చరిస్తున్నారు మానసిక నిపుణులు.

### భయం - ఒత్తిడి - రోగ నిరోధకత

తీవ్రమైన భయానికి, ఆందోళనకు గురైనప్పుడు మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. ఆ ప్రభావంతో శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. కొన్నిసార్లు ఇది అవసరం కూడా. ఉద్యోగంలో లక్ష్యాన్ని చేరుకోవడానికో, పరీక్షల్లో విజయం సాధించడానికో కొంత ఒత్తిడి తప్పదు. అలాంటి సమయాల్లో విడుదలయ్యే కార్టిసాల్ మనం ఆయా లక్ష్యాల్ని పూర్తి చేయడానికి సాయపడుతుంది. కాని విపత్తుల సమయంలో కలిగే మానసిక ఒత్తిడి వల్ల కార్టిసాల్ భారీ మోతాదులో విడుదల అవుతుంది. ఇలా అధికంగా విడుదలైన కార్టిసాల్ తల నుంచి కాలి వేలు వరకు మన శరీర భాగాలన్నింటి మీదా ప్రభావం చూపిస్తుంది. అందుకే, ఒత్తిడి వల్ల రాని రోగం అంటూ లేదు. జుట్టు రాలిపోతుంది. చర్మం ముడతలు పడుతుంది. రక్తపోటు అదుపు తప్పుతుంది. మూత్రపిండం, కాలేయం పనితీరు దెబ్బతింటుంది. గుండెపై ఆ భారం పడిపోయి... గుండెపోటుకు చేరువ అవుతాం. వ్యాధులపై పోరాటం చేసే నిరోధక శక్తి కూడా తగ్గిపోతుంది.

### అపోహలు నమ్మొద్దు

సామాజిక మాధ్యమాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. అదో వ్యసనంగా మారిపోయింది. అయితే సోషల్ మీడియా ద్వారా అందుతున్న సమాచారం చాలా సందర్భాల్లో తప్పులతడకే. నిపుణులతో సంబంధం లేకుండా ఎవరికి తోచిందేదో వాళ్లు మాట్లాడేస్తున్నారు, రాసేస్తున్నారు. దాంతో భయాలు ఎక్కువవుతున్నాయి. కొన్నిసార్లు అవి, 'మనకేం కాదులే' అన్న మితిమీరిన విశ్వాసాన్ని పెంచుతున్నాయి. మనది వేడి ప్రదేశం కాబట్టి వైరస్ పెరగదనో, వృద్ధులకు మాత్రమే వస్తుందనో తప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. ఎండకు రాదని ఎక్కడా రుజువు కాలేదు. ఇండియన్స్‌కి ఇమ్యునిటీ ఎక్కువ అనడానికి కూడా సాక్ష్యం లేదు. పిల్లలకు రాదనేదీ అపోహే. మగవాళ్లకే అధికంగా వస్తుందనడం కూడా సరికాదు. సాధారణంగా ప్రయాణాలు చేసేవాళ్లు, పొగతాగేవాళ్లు.. ఎక్కువగా పురుషులే కాబట్టి, మగవాళ్లలో కరోనా ప్రభావం ఎక్కువ కనిపించొచ్చు. స్మోకింగ్ జోన్స్‌లో గుంపులు గుంపులుగా పొగతాగడం, సిగరెట్లను షేర్ చేసుకోవడం, పొగ వల్ల ఊపిరితిత్తులు బలహీనపడి ఇన్‌ఫెక్షన్ సులువుగా రావడం... లాంటి కారణాల వల్ల మగవాళ్లు ఎక్కువగా దీనిబారిన పడే అవకాశం ఉంటున్నదంతే. ఒకటారెండా, సోషల్ మీడియా నిండా ఇలాంటి అసత్యాలూ, అర్ధసత్యాలే! ఇవన్నీ మనసును ప్రభావితం చేసి, మనిషి మీద ఒత్తిడి పెంచేవే.

### ఐసొలేషన్ శిక్ష కాదు..

ఐసొలేషన్‌లో ఉన్నవాళ్లు... నాలుగు గోడలు దాటివస్తే మాత్రం కరోనాకు నిశ్శబ్ద ప్రచారకులుగా మారిపోతారు. అందుకే క్వారెంటైన్‌లో ఉండటం అంటే తమకేదో శిక్ష వేసినట్టుగా భావించకూడదు. గడప దాటడం వల్ల తమతో పాటు తమ ఆత్మీయులను, తమ దేశాన్ని కూడా ప్రమాదంలో పడేస్తున్నామన్న స్పృహ వారికి ఉండాలి. హాస్పిటల్ క్వారెంటైన్‌లో... బోర్ ఫీలవకుండా పుస్తకాలు చదువుకోవచ్చు. ఆత్మీయులతో రెగ్యులర్‌గా చాట్ చేయొచ్చు. ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు. సినిమాలు చూడొచ్చు. ఇంట్లో స్వీయ నిర్బంధంలో ఉన్నవాళ్లకు కుటుంబ సభ్యులు కూడా ధైర్యం చెప్పాలి. మేం ఉన్నామనే భరోసా ఇవ్వాలి. వృద్ధులు మందులు మానకూడదు. పోషకాహారం తీసుకోవాలి. దాంతో ఇమ్యూనిటీ వస్తుంది. విటమిన్-సి కోసం జామ, ఆరెంజ్ లాంటివి తినాలి. ప్రతి ఆహారంలోనూ కాసిన్ని నిమ్మ చుక్కలు వేసుకోవాలి. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి.

**ఏం చేయాలి?** శరీరానికి కరోనాను ఎదుర్కొనే సామర్థ్యం రావాలంటే... ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినట్టు శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంచుకోవాలి.

- విటమిన్- సి (సిట్రస్), ప్రొటీన్లు ఎక్కువగా ఉండే (పప్పులు, కోడిగుడ్లు, ఉడికించిన మాంసం) ఆహారం తీసుకోవడం ద్వారా శారీరక ఆరోగ్యం చేకూరుతుంది. విటమిన్-డి కోసం ఎండలో నిలబడాలి.
- వ్యాయామం ద్వారా రక్తప్రసరణ పెరిగి ఇమ్యూనిటీ పుంజుకుంటుంది. ఇందుకోసం జిమ్‌కే వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే ఎన్నో రకాల ఎక్సర్‌సైజులు చేయొచ్చు. యూట్యూబ్‌లో వీడియోలు కూడా దొరుకుతున్నాయి.
- సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, అభిరుచులను పెంచుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవడం... వంటి వ్యాపకాలతో మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది.
- ప్రాణాయామం, ధ్యానం, యోగా; ఆస్తికులైతే దైవ ప్రార్థన, ఏ భగవద్గీతో, ఖురానో, బైబిలో, గురుగ్రంథమో చదవడం ద్వారా ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. దీని వల్ల మనసులోని ఆందోళన తగ్గి, ప్రశాంతత లభిస్తుంది.
- సామాజిక ఆరోగ్యం కోసం నేరుగా మనుషులను కలవనవసరం లేదు. వీడియో కాల్స్ లేదా వాట్సప్ కాల్స్ ద్వారా ఆత్మీయులతో మాట్లాడుకోవచ్చు. అన్నింటికీ మించి కుటుంబంతో గడపడానికి ఇదొక మంచి అవకాశం. ఇంట్లోనే అందరూ ఫన్ గేమ్స్, ఇండోర్ గేమ్స్ ఆడొచ్చు. కలిసి సినిమాలు చూడొచ్చు.

మనోజయమే మహాజయం!
మనసును గెలిచిన వాళ్లు ప్రపంచాన్నే గెలువగలరు.
కరోనా వైరస్ ఓ లెక్కా!

### సమస్యల వలయం!

భయం వల్ల ఒత్తిడి పెరిగి, శరీరంలో అనేక ప్రతిచర్యలు జరుగుతాయి. ఈ క్షణంలో చనిపోతామేమో అన్న భయంతో చెమట అధికంగా పడుతుంది. గుండెదడ పెరుగుతుంది. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఏ భయానకమైన పరిస్థితిని ఎదుర్కొన్నా ఇలాంటి ప్రతిచర్యలే జరుగుతాయి. భయం వల్ల కలిగే ఒత్తిడి మెదడులోని రసాయనాల సమతుల్యతను దెబ్బతీస్తుంది. వీటి ప్రభావం మొత్తం శరీరం మీద ఉంటుంది. మెదడు పనితీరులో తేడాలు వస్తాయి. దాంతో డిప్రెషన్, యాంగ్జయిటీ, స్లీప్ డిజార్డర్లు, అబ్‌సెసివ్ కంపల్షన్ డిజార్డర్ (ఒసిడి) లాంటివి పెరుగుతాయి. ఇక అప్పటికే ఒసిడి సమస్యతో ఉన్నవాళ్ల పరిస్థితి కరోనా భయంతో మరింత జటిలం అవుతుంది. సబ్బుతో చేతులు పదే పదే కడిగీ కడిగీ చర్మం ఊడి వస్తుంది. మెదడులోని రసాయనాల అసమతుల్యత ఎక్కువగా ఉంటే వ్యతిరేక ఆలోచనలు పెరుగుతాయి. విరక్తి భావన కలుగుతుంది. నిరాశాజనకంగా ఉంటారు. ఇక భవిష్యత్తు లేదని డీలా పడిపోతారు. జీవించగలమన్న నమ్మకం పోతుంది. అధైర్యపడతారు. ఆత్మహత్య ఆలోచనలు చుట్టుముడతాయి. బైపోలార్ లాంటి సమస్యలున్నవాళ్లకు మందులు సమర్థంగా పనిచేయవు. ఒత్తిడి, ఆందోళన ఎక్కువగా ఉండటం వల్ల మందులు వాడినా సమస్య నియంత్రణలోకి రాకపోయే ప్రమాదం ఉంటుంది.

ఒత్తిడి వల్ల కార్టిసాల్ పెరిగితే షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయి. మందులు వాడినా బీపీ కంట్రోల్‌లో ఉండదు. ఆస్తమా అటాక్స్ ఎక్కువ అవుతాయి. మైగ్రేన్ సమస్య పెరుగుతుంది. ఫిట్స్ ఉన్నవాళ్లకు వాటి తీవ్రత ఎక్కువ అవుతుంది. గుండె బలహీనంగా ఉన్నవాళ్లకు, అప్పటికే గుండెలో సమస్య ఉన్నవాళ్లకు గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే విపత్తు సమయాల్లో గుండెపోట్లతో చనిపోయేవాళ్లు అధికంగా ఉంటారు.



**డాక్టర్ విరించి శర్మ**
సైకియాట్రిస్ట్, డైరెక్టర్
మానస హాస్పిటల్, సికింద్రాబాద్
81069 60448

## ఉన్నదంతా ఇచ్చేశాడు..

సామాన్య రైతు రూ.50 వేల విరాళం
ఆదర్శంగా నిలిచిన ఆదిలాబాద్ వాసి

# అన్న'దాత'



📷 పిట్ల రాము

**కుబేరులు దానం చేయడం గొప్ప కాదు. ఓ సామాన్యుడు చేయడమే గొప్పవిషయం. కరోనా నేపథ్యంలో ఎందరో సినీ తారలు, వ్యాపార ప్రముఖులు విరాళాలు ఇస్తున్నారు. ఆ సహాయం మరవలేనిది. కానీ ఒక సాధారణ రైతు తన పంటను అమ్మితే వచ్చినడబ్బంతా సాయం చేయడం మెచ్చదగిన విషయం. నలుగురిలో స్ఫూర్తి నింపే ఈ కథనం తప్పక చదవాలి...**

ప్రపంచాన్ని కరోనా మహమ్మారి గడగడలాడిస్తున్నది. ఈ నేపథ్యంలో కొవిడ్-19 ప్రబలకుండా పలు దేశాలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. దీంతో రోజువారీ కూలీలు, పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇలాంటివాళ్లను ఎవరు ఆదుకుంటారు? వారికి చేతనైన సాయం చేయడం ఆపత్కాలంలో తన బాధ్యతగా గుర్తించాడు ఆదిలాబాద్‌కు చెందిన ఓ రైతన్న. ఆదిలాబాద్ జిల్లాలోని లాండసాగ్వీ గ్రామానికి చెందిన సాధారణ రైతు... మోర హన్మండ్లు. ఈయనకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. భార్య, ఇద్దరు కొడుకులతో కలిసి సేద్యం చేస్తున్నాడు. కరోనా లాక్‌డౌన్ గురించి ఎన్నో కథలు విన్నాడు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోవడంతో రోజువారీ కూలీలు, పేదలు పడుతున్న ఇబ్బందులూ తెలుసుకున్నాడు. వీరి కోసం ఏదైనా చేయాలనుకున్నాడు. కానీ ఏం చేయగలడు? రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. పంట డబ్బే జీవనాధారం. ఈసారి తన పొలంలో సోయాబీన్, శనగ పంటలు వేశాడు. కాలం కలిసొచ్చింది. మంచి దిగుబడే వచ్చింది. పంట అమ్మితే వచ్చిన డబ్బులో పెట్టుబడి సొమ్ము తీసేశాడు. ఎక్కడ తెచ్చిన డబ్బు అక్కడ ఇచ్చేశాడు. అన్నీపోగా 50 వేల రూపాయలు మిగిలాయి. ఆ డబ్బు బ్యాంకులో ఉంది. ఆ సొమ్మును విరాళంగా ఇవ్వాలనుకున్నాడు. కానీ నిర్ణయం తన ఒక్కనిదే కాదుగా. భార్యా పిల్లలున్నారు. వారి పరిస్థితి ఏంటి? వారి కోసమే కదా కష్టపడి సంపాదించింది. అందుకే పిల్లలను అడగాలనుకున్నాడు. వారేమంటారో అని సందేహించాడు. కానీ బిడ్డల్లో ప్రవహిస్తున్నది కూడా ఆ తండ్రి రక్తమే కదా. సంతోషంగా ఒప్పుకున్నారు. అనుకున్నదే తడవుగా రూ.50 వేల చెక్కును తన కొడుకులతో కలిసి కలెక్టర్ శ్రీదేవసేన, ఎస్పీ విష్ణువారియర్‌లకు అందజేశాడు హన్మండ్లు.

### పలువురికి ఆదర్శం

ఓ పేద రైతు కరోనా బాధితుల కోసం చేసిన సహాయాన్ని పలువురు ప్రశంసించారు. కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు హృదయపూర్వకంగా అభినందించారు. ఆ చొరవ ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను కూడా ఆలోచింప చేసింది. వారు సైతం కరోనా బాధితులు కోసం తమవంతు సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. ఎంపీపీలు రూ.1.70 లక్షలు, జడ్పీటీసీలు రూ.1.80 లక్షలు, జిన్నింగ్ వ్యాపారులు రూ.3.75 లక్షలు అందించారు. 'ఇది సాయం కాదు. నా బాధ్యత' అంటాడు హన్మండ్లు.

- భాకే రఘునాథ్ రావు
స్టాఫ్ రిపోర్టర్-ఆదిలాబాద్

### ఉన్నదాంట్లో కొంత..

కరోనా వల్ల అన్నీ బంద్ అయ్యి లేనోళ్లు బాగా ఇబ్బంది పడుతుండ్రు. ఆకలి బాధ ఏందో నాకు ఎర్కే. మన కడుపునిండితే సాలదు. అన్నం దొరకనోళ్ల గురించి ఆలోచించాలి. నాకున్న నాలుగు ఎకరాల్లో సోయాబీన్, శనగ పంటలు ఏసిన. కాలం కలిసొచ్చింది. మంచి పంట వొచ్చింది. అందుకే ఉన్నదాంట్లో సాయం చేద్దామని నా కొడుకులను అడిగినా. వాళ్లు ఒప్పుకున్నరు. పంటలు అమ్మితే వచ్చిన డబ్బుల్లో రూ.50 వేలు ఇద్దామనుకున్న. కలెక్టర్, ఎస్పీలకు చెక్కు ఇచ్చిన.

- మోర హన్మండ్లు, రైతు, లాండసాంగ్వీ, ఆదిలాబాద్

## ఇంట్లో పెద్దవాళ్లు.. బయటికి వెళ్లొస్తే ఏం చేయాలి?

సందేహం సమాధానం



**నాకు 26 ఏళ్లు. లాక్ డౌన్ ఉన్నప్పటికీ వృత్తిరీత్యా తప్పనిసరిగా రోజూ బయటికి వెళ్లాల్సిన పరిస్థితి. నా తల్లిదండ్రులు పెద్దవాళ్లు. 65 ఏళ్ల అమ్మకు మధుమేహ వ్యాధి కూడా ఉంది. నాన్నకు 70 ఏళ్లు. బీపీ పేషెంటు. ఇలాంటి పరిస్థితిలో నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

– వివేక్, కరీంనగర్

అత్యవసర సర్వీసుల్లో భాగంగా మీరు బయటికి వెళ్లక తప్పదంటున్నారు. అయితే ప్రతిరోజూ మాత్రమే కాదు... ఏ కూరగాయలు తెచ్చుకోవడానికో కొద్దిసేపటి కోసం అయినా సరే.. ఏ కారణం వల్ల బయటికి వెళ్లినా రాగానే కాళ్లూ, చేతులు శుభ్రం చేసుకోకుండా ఇంటి లోపలికి రావొద్దు. గేటు బయటే సబ్బుతో కాళ్లూ, చేతులు కడుక్కుని ముందుగా వాష్ రూమ్‌లోకే వెళ్లాలి. మీ బట్టలు, చెప్పులు కూడా శుభ్రం చేయాలి. మీరు వేసుకున్న బట్టలన్నీ తీసి బ్లీచింగ్ పౌడర్ ద్రావణం గానీ, డిటర్జెంట్ వాటర్‌లో గానీ ఆ దుస్తులను వేసేయాలి. మీ ఒంటి మీదో, జుట్టు మీదో వైరస్ ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. కాబట్టి తలస్నానం చేయాలి. అప్పుడే బయటికి రావాలి.

అయితే, మీ ఇంట్లో ఇద్దరు పెద్దవాళ్లు ఉన్నారు. మీరు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్నిసార్లు వాళ్లకు సోకే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి పెద్దవాళ్లకు దూరంగా ఉండాలి. వాళ్లను ముట్టుకోవడం, హత్తుకోవడం చేయొద్దు. సాధ్యమైతే వేరే గదిలో ఉండటం మేలు. ఒకే హాల్‌లో ఉండాల్సి వచ్చినా వాళ్లకు కనీసం రెండు మీటర్ల దూరంలో ఉండి మాట్లాడాలి. ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. సాధారణంగా కొవిడ్ 19 లక్షణాలు కనిపించడానికి 2 నుంచి 14 రోజులు పడుతుంది.



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

ఎక్కువ మందిలో 5 నుంచి 7 రోజుల్లో బయటపడుతుంది. 14 రోజులు దాటిన తర్వాత లక్షణాలు లేకుంటే ఇక రాదనే అనుకోవాలి. అయితే మీలాగా యువకులైనవాళ్లలో చాలాసార్లు ఎటువంటి లక్షణాలూ లేకుండా కూడా వైరస్‌కి క్యారియర్లుగా ఉంటారు. అంటే కొవిడ్ ఇన్‌ఫెక్షన్ మీ శరీరంలోకి వచ్చిందీ, వెళ్లిందీ మీకే తెలియకపోవచ్చు. వ్యాధినిరోధక శక్తి బలంగా ఉన్నవాళ్లలో ఇన్‌ఫెక్షన్ రావడం, దానితో వ్యాధినిరోధక కణాలు పోరాడి దాన్ని పారదోలడం... అన్నీ ఎటువంటి లక్షణాలు లేకుండానే జరిగిపోవచ్చు. ఈ సమయంలో వృద్ధుల దగ్గరికి వెళ్తే అసలే ఇమ్యూనిటీ తక్కువ కాబట్టి వాళ్లు ఇన్‌ఫెక్షన్ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ఇటలీలో అంత వేగంగా వ్యాధి వ్యాపించడానికి కారణం ఇదే. ఏ లక్షణాలు లేని యువకులు బయటికి వెళ్లి పార్టీలు చేసుకోవడంతో కరోనా వ్యాప్తి ప్రమాదకరంగా పరిణమించింది. అందుకే ముఖ్యంగా యువతీయువకులు ఇల్లు కదలకండి. తప్పనిసరై బయటికి వెళ్లాల్సి వస్తే రక్షణ చర్యలు పాటించండి. మీ గదిలో మీరు సెపరేట్‌గా ఉండండి.

## ఈ కుర్రోడు కరోనా వారియర్



కరోనా సెలవుల కారణంగా విద్యార్థులంతా ఇంటికే పరిమితం అయితే, కేరళకు చెందిన అలోక్ అనే పదేండ్ల విద్యార్థి మాత్రం ఆ వైరస్‌పై పోరుకు సై అంటున్నాడు. ఈ క్రమంలో తన సృజనాత్మకతతో... దానంతట అదే శానిటైజ్ చేసే ఓ రోబోను రూపొందించాడు. పిల్లలంతా తమ తోబుట్టువులతో కలిసి ఇండ్లల్లో ఆటలాడుకుంటున్నా.. అలోక్ మాత్రం ఆ ఖాళీ సమయాన్ని రోబో తయారీకి ఉపయోగించాడు. కేరళలోని గోవిందాపురం కేంద్రీయ విద్యాలయంలో నాలుగో గ్రేడ్ చదువుతున్న అలోక్‌కు బాల్యం నుంచే రోబోటిక్స్ పై అవగాహన ఉంది. అప్పటి నుంచే ఇంట్లో చిన్న చిన్న ప్రయోగాలు చేస్తూ తల్లిదండ్రులు, బంధువులను అబ్బుర పరిచేవాడు. కరోనాను అరికట్టేందుకు కేరళ ప్రభుత్వం స్కూళ్లకు సెలవులు ఇవ్వడం, ప్రతిరోజూ కరోనాకు సంబంధించిన వార్తలే వస్తుండటం అలోక్‌ను ఆలోచింపజేసింది. ఈ క్రమంలో శానిటైజర్‌ను చల్లే రోబోను ఆవిష్కరించాడీ కుర్రాడు. దీనికి ప్రత్యేక సెన్సర్లు ఉంటాయి. దానికి దగ్గరగా చేతులు చాపగానే శానిటైజర్ ఆటోమెటిక్ గా స్ప్రే చేస్తుంది. అలోక్ శానిటైజర్ రోబోను ఆవిష్కరించిన విషయాన్ని తండ్రి దినేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ కరోనా వారియర్‌ను అంతా అభినందిస్తున్నారు. పెద్దయ్యాక గొప్ప సైంటిస్టును అవుతానని ప్రకటించాడీ కుర్రాడు. తనకు అబ్దుల్ కలామ్ ఆదర్శమని చెబుతున్నాడు. త్వరలోనే మరిన్ని రోబోలకు ప్రాణం పోయనున్నాడు అలోక్.

# మేమున్నామనీ.. మీకేం కాదనీ!



ఇటలీ మనకో పాఠం నేర్పింది.
అది పక్కా ఆచరించాల్సిన పాఠమే.
పౌర నిర్లక్ష్యమే ఇటలీని ముంచింది.
ప్రభుత్వం చేతులెత్తేసింది.
ఇటాలియన్లకు మాత్రమే
వైద్యం చేస్తామని చెప్పేసింది.
కానీ.. ఇటలీలో ఉన్న తెలంగాణ
విద్యార్థుల పరిస్థితి ఏంటి?
మనల్ని మనం కాపాడుకుంటూనే
విదేశాల్లో ఉన్న మనవాళ్లనూ
కాపాడుకోవాలి.
కానీ ఈ పని ఎవరు చేస్తారు?

**మేం ఉన్నామంటున్నారు** తెలంగాణ టెకీలు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాల నేతృత్వంలోని ఐటీ నిపుణులు... ఇటలీలాంటి కరోనా ప్రభావిత దేశాల్లో చిక్కుకుపోయిన మనవాళ్లకు వైద్య సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ముందుగా, శవాల దిబ్బలా మారుతున్న ఇటలీలో ఎలాంటి వైద్యసాయం అందకుండా బిక్కుబిక్కుమంటున్న తెలంగాణ విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. తక్షణ బాధ్యతగా మనో నిబ్బరాన్నిస్తూ... ఈ నెల 29న 'డిజిథాన్ క్లినిక్' ద్వారా వైద్య సేవలు ప్రారంభించనున్నారు. ఇలా ఆన్‌లైన్ ద్వారా ఎన్నారైలకు వైద్య సాయం అందిస్తున్న తొలి సంస్థ టీటా.

అఖిల్ ఇటలీలో ఉంటున్నాడు. వయసు పద్దెనిమిది. అక్కడ గ్రాడ్యుయేషన్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. అఖిల్ వాళ్లది హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి. కొవిడ్-19 పరీక్షలు చేయించుకొని, ఇండియా వచ్చేద్దామని అనుకున్నాడు. అంతలోనే విమానం మిస్ అయ్యింది. అప్పటికే అఖిల్ దగ్గు.. జ్వరంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. కొవిడ్ పరీక్షలు నిర్వహించలేమని ప్రభుత్వం తేల్చి చెప్పేసింది. నిజానికి అక్కడ అందుబాటులో కిట్లు కూడా లేవు.



## టీటా హ్యాకథాన్

కరోనాపై పోరాటంలో భాగంగా టీటా... జనతా కర్ఫ్యూకు సమాంతరంగా టీటా కొవిడ్-19 హ్యాకథాన్ నిర్వహించింది. 13 దేశాల నుంచి 836 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. 136 ఐడియాలకు సంబంధించిన ఎంట్రీలను షార్ట్‌లిస్ట్ చేశారు. హ్యాకథాన్‌లో భాగంగా దినేష్ అనే యువకుడు ఆటోమేటిక్ హ్యాండ్ వాషర్‌ను తయారు చేశాడు. రవికిరణ్ రూపొందించిన స్మార్ట్ మాస్క్‌ను కనుక కట్టుకుంటే సమీపంలో ఎవరైనా కరోనా లక్షణాలు ఉన్నవారుంటే, అదే అలర్ట్ చేస్తుంది. కరోనా సందేహాలపై చాట్‌బోట్ రూపొందించే ప్రతిపాదన కూడా ఉంది.. రెండో రౌండ్ హ్యాకథాన్‌ను ఈనెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించనున్నారు. స్టూడెంట్స్.. ఎంటర్‌ప్రెన్యూర్స్.. ఇంక్యుబేటర్స్.. టెక్నాలజిస్టులు.. కోడర్లు.. హెల్త్‌కేర్ ప్రొవైడర్లు.. స్టార్టప్‌లు.. వైద్యసంస్థలు ఈ హ్యాకథాన్‌లో పాల్గొనవచ్చు. చివరి తేదీ ఈనెల 28. ఆసక్తి ఉన్నవారు bit.ly/CoronaHackathon లేదా 8123123434 ద్వారా సంప్రదించవచ్చు.

అన్షుమన్ ఇటలీలోని హీథి అనే ప్రాంతంలో ఉంటున్నాడు. స్థానిక యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు. అప్పటికే దగ్గు.. జ్వరం ఉండటంతో భయం మొదలైంది. అప్పుకే స్థానిక నర్సులు, డాక్టర్లకు కొవిడ్-19 సోకడం వల్ల విదేశీయులకు వైద్యం అందించడానికి తగినంత సిబ్బంది తమ దగ్గర లేదని చేతులు ఎత్తేశారు. దీంతో, చేసేది లేక అన్నీ సిద్ధం చేసుకొని ఇండియాకు వద్దామనుకున్నాడు ఆ విద్యార్థి. ఆ సమయంలో విమానాలు రద్దయ్యాయి.

### కాపాడు.. కాపాడుకో

ఒక్క ఇటలీయే కాదు. అమెరికా.. స్పెయిన్.. ఇరాన్.. ఇంగ్లం డ్.. జర్మనీ లాంటి దేశాల్లో చాపకింద నీరులా వైరస్ పాకుతుంటే.. అక్కడున్న మనవాళ్లు మాత్రం భయం భయంగా బతుకీడుస్తున్నారు. వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాతృభూమి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఆ సమయంలో మనల్ని మనం కాపాడుకుంటూనే, మనవాళ్లకు సాయం చేయడానికి టీటా తన వంతు ప్రయత్నం ప్రారంభించింది.

### వీడియో ప్రిస్క్రిప్షన్

ఇటలీలాంటి దేశాల్లో చిక్కుకుపోయిన మనవాళ్లను కాపాడేందుకు టీటా 'డిజిథాన్ క్లినిక్' అప్లికేషన్‌ను రూపొందించింది. హైదరాబాద్‌లో ఉన్న డాక్టర్లు ఇటలీలోని పేషెంట్ పరిస్థితిని పరిశీలిస్తారు. వీడియో ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక స్థాయిలో వైద్య సహాయం పొందవచ్చు. ఒకవేళ పాజిటివ్ అని తేలితే ఇటలీలో ఉన్న డాక్టర్ల సాయంతో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

### అంతా ఉచితం

డిజిథాన్ క్లినిక్ ద్వారా చికిత్స తీసుకునేవారు ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితం. దీనికి సంబంధించిన ఫీజులూ ఇతరత్రా వ్యవహారాలు టీటా చూసుకుంటుంది. ఆన్‌లైన్ క్లినిక్ ద్వారా ఏకకాలంలో అందరికీ సలహా చికిత్స సూచనలు అందించడం వల్ల వైద్యుల కొరత ఎదురుకాదు. ప్రస్తుతానికి తెలంగాణ బిడ్డలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ నెట్‌వర్క్ ద్వారా సేవలందించే వైద్యబృందం తెలుపుతున్నది.

### ఎన్నారైలకు ఉపయోగం

"కరోనా వైరస్‌పై యుద్ధంలో మొదట్నుంచీ టీటా కీలకపాత్ర పోషిస్తున్నది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని మొదట మేమే అభ్యర్థించాం. తర్వాత కరోనాకు సూచనలను పేర్కొంటూ ఆన్‌లైన్ హ్యాకథాన్ నిర్వహించాం. ప్రధాని అభినందిస్తూ ట్వీట్ చేశారు. కొవిడ్‌పై పోరాటంలో భాగమే ఈ డిజిథాన్ క్లినిక్ అప్లికేషన్ కూడా. విదేశాల్లోని ఎన్నారైలకు ఈ సేవలు ఉపయుక్తంగా ఉంటాయి. యాదృచ్ఛికంగా నా పుట్టినరోజు నాడే ఇంత మంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండటం సంతోషంగా ఉంది."
-సందీప్ మక్తాల

### డెమో విజయవంతం

శుక్రవారం నిర్వహించిన క్లినిక్ డెమో విజయవంతం అయింది. ఓ ఎన్నారైతో వైద్యుడు అనుసంధానమై వైద్య పరీక్షలపై సలహా అందించారు. ఈ నెల 29న పూర్తిస్థాయిలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. శ్వాస హాస్పిటల్ సీఈఓ డాక్టర్ విష్ణు వీరపనేని.. ఇటలీలో వైద్య పరీక్షల కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు తొలి అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేశారు.

దాయి శ్రీశైలం




ALLARI

## పద్యం


వంపు కఱ్ఱ గాల్చి వంపు దీర్చగవచ్చు
గొండలన్ని పిండి గొట్టవచ్చు
గఠిన చిత్తు మనసు కరిగింపగారాదు
విశ్వదాభిరామ వినురవేమ.

**భావం:** వంకర, టింకరగా ఉన్న కర్రను కాల్చి సరిగ్గా నిలబెట్టవచ్చు. కొండలనైనా పిండి చేయవచ్చు. ఇలాంటి అసాధ్యమైన పనులెన్నింటినైనా చేయవచ్చు. కానీ కఠినమైనవాడి అంటే.. మూర్ఖుడి మనసుని మాత్రం మార్చలేము అని ఈ పద్య భావం.


## దారి కనుక్కోండి




## చుక్కలు కలుపండి




# చిత్రం



చిన్నారి రామ్‌చరణ్‌తో చిరంజీవి

## రంగస్థల దినోత్సవం రోజున..

ఉగాది రోజున ట్విట్టర్ ఖాతాను ఆరంభించిన చిరంజీవి వరుస ట్వీట్లతో అభిమానుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చిరంజీవి ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 'చరణ్ పుట్టినప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. కొద్దిరోజుల తర్వాత చరణ్ పుట్టిన తేదీ అయిన మార్చి 27ను 'ప్రపంచ రంగస్థల దినోత్సవం'గా జరుపుకుంటారని తెలుసుకున్నా. చేప స్వభావసిద్ధంగా నీటిలోనే జీవనాన్ని సాగించినట్లు చరణ్ నటననే వృత్తిగా ఎంచుకున్నాడు. చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు' అని చిరంజీవి పేర్కొన్నారు. తాను చిన్నప్పుడు రామ్‌చరణ్‌ను ఆడిస్తున్న ఓ ఫొటోను ఈ ట్వీట్‌కు జత చేశారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్‌మీడియాలో మెగాభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది.



'రౌద్రం రణం రుధిరం' చిత్రంలో రామ్‌చరణ్

కరోనా మహమ్మారిని పారదోలేందుకు ప్రభుత్వాలు అహర్నిశలు శ్రమిస్తున్నాయి. ఈ పోరాటంలో తమ వంతు సాయాన్ని అందిస్తోంది తెలుగు చిత్రసీమ. కరోనా కారణంగా కష్టాల్ని ఎదుర్కొంటున్న వారిని ఆదుకునేందుకు విరాళాల్ని అందిస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు సినీ ప్రముఖులు. అందరిలో స్ఫూర్తి నింపుతూ ఐకమత్యాన్ని చాటుకుంటున్నారు.

## క్వారంటైన్ టైమ్స్

నాయకానాయికల కెరీర్ మొత్తం షూటింగ్‌లు, ప్రచారాలతోనే గడిచిపోతుంటుంది. అగ్రకథానాయికలైతే విరామం లేకుండా ఏడాదంతా బిజీగా కనిపిస్తూనే ఉంటారు. కొద్దిగా విశ్రాంతి దొరికినా కుటుంబానికే సమయాన్ని కేటాయిస్తుంటారు. ప్రస్తుతం కరోనా వ్యాప్తితో హోమ్ క్వారంటైన్‌ను పాటిస్తున్న తారలంతా ఈ విరామంలో ఫ్యామిలీ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. బిజీ షెడ్యూల్ కారణంగా ఇన్నాళ్ల ఎడబాటును మరిపిస్తూ ఈ ఆనందోత్సాహాల్ని అభిమానులతో సోషల్‌మీడియా ద్వారా పంచుకుంటున్నారు. సమంత తన భర్త నాగచైతన్య కోసం వంట చేస్తున్న ఓ వీడియోను పోస్ట్ చేసింది. లంచ్ ప్రిపరేషన్ అంటూ ఆమె పెట్టిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటున్నది. క్వారంటైన్ టైమ్‌ను చై, సామ్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారని అభిమానులు చెబుతున్నారు.




సమంత

## కనబడితే నిప్పుకణం


నిజాంపై జంగ్ సైరన్ మోగించిన గోండు వీరుడు కొమరం భీం, ఆంగ్లేయులపై కదం తొక్కిన మన్యం దొర అల్లూరి సీతారామరాజు...ఈ ఇద్దరు చారిత్రక పురుషుల నేపథ్యానికి కాల్పనిక అంశాల్ని జోడించి దర్శకుడు రాజమౌళి రూపొందిస్తున్న చిత్రం 'రౌద్రం రణం రుధిరం'. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులు. డి.వి.వి.దానయ్య నిర్మాత. వచ్చే ఏడాది జనవరి 8న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సినిమాలో కొమరం భీం పాత్రలో ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్నారు. శుక్రవారం రామ్‌చరణ్ పుట్టినరోజును పురస్కరించుకొని ఆయన ఫస్ట్‌లుక్‌తో పాటు పాత్ర తాలూకు వీడియోను విడుదల చేశారు. 'ఆడు కనబడితే నిప్పుకణం నిలబడినట్లుంటది, కలబడితే ఏగుచుక్క ఎగబడినట్లుంటది, ఎదురుపడితే చావుకైనా చెమటధారకట్టది, బాణమైనా, బందూక్ అయినా వానికి బాంచన్ అయితది..ఇంటిపేరు అల్లూరి..సాకింది గోదారి..నా అన్న మన్నెం దొర అల్లూరి సీతారామరాజు' అంటూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌లో రామ్‌చరణ్ పాత్రను వర్ణించడం ఆకట్టుకునేలా ఉంది. ఈ వీడియోలో రామ్‌చరణ్ విల్లంబులు సంధిస్తూ..కఱ్ఱసాము ప్రదర్శిస్తూ..బందూక్ ఎక్కుపెడుతూ శక్తివంతమైన పాత్ర చిత్రణలో కనిపించారు.

## ప్రభాస్ రూ.4 కోట్లు




కరోనా విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభాస్ నాలుగు కోట్ల రూపాయల్ని విరాళంగా అందజేశారు. ప్రధాన మంత్రి సహాయనిధికి మూడు కోట్లు అందించారు. అలాగే తెలంగాణ, ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు తలా యాభై లక్షల్ని అందించనున్నట్లు ప్రకటించారు.

## అల్లు అర్జున్ కోటి ఇరవై ఐదు లక్షలు



అల్లు అర్జున్ కోటి ఇరవై ఐదు లక్షల రూపాయల్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ ప్రభుత్వాలకు వితరణగా అందజేశారు. 'కరోనా వైరస్ మన రోజువారి జీవితాల్ని అతలాకుతలం చేసింది. ఈ విపత్కర పరిస్థితుల్లో కూడా డాక్టర్లు, నర్సులు, మిలట్రీ, పోలీస్‌తో పాటు పలు రంగాల వారు సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. వారందరి నుంచి స్ఫూర్తి పొంది నా వంతుగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి యాభై లక్షలు, ఏపీకి యాభై లక్షలు, కేరళకు 25 లక్షల్ని అందిస్తున్నాను. స్వీయనిర్బంధంతో పాటు చేతులను శుభ్రపరుచుకోవడం ద్వారా కరోనాను కట్టడిచేయవచ్చు' అని అల్లు అర్జున్ చెప్పారు.



రవిశంకర్, నవీన్

## మైత్రీ మూవీ మేకర్స్ 20లక్షలు

కరోనా వైరస్ తాలూకూ క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి తమ వంతుగా ఇరవై లక్షల్ని విరాళంగా అందజేసింది మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ. 'కరోనాపై పోరాటానికి మద్దతుగా ఇరవై లక్షలు విరాళంగా అందజేస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వానికి పది లక్షలు, ఆంధ్రప్రదేశ్‌కు పది లక్షలు అందిస్తున్నాం. ఈ ఆపద సమయంలో ఎక్కువ కుటుంబాలకు సాయపడేందుకు మరింత మంది ముందుకు వస్తారని ఆశిస్తున్నాం. ఈ సంక్షోభాన్ని సమిష్టిగా మనం అధిగమించగలం. సామాజిక దూరాన్ని పాటిస్తూ కరోనా మహమ్మారిపై జరిపే పోరాటంలో విజయం సాధిద్దాం' అని రవిశంకర్, నవీన్ తెలిపారు.



తమన్

## సంగీతకారుల కోసం..


సినిమా చిత్రీకరణలు రద్దు కావడంతో ఉపాధి కోల్పోయి సినీ కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. వారికి అగ్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు అండగా నిలుస్తున్నారు. తాజాగా తెలుగు, తమిళసినీ మ్యూజిషియన్స్ యూనియన్‌కు తమన్ ఐదు లక్షల విరాళం అందజేశారు.



## అశ్వినీదత్ ఇరవై లక్షలు

కోవిడ్-19 వ్యాప్తి నిరోధం కోసం వైజయంతీ మూవీస్ అధినేత సి.అశ్వినీదత్ ఇరవై లక్షలు విరాళం ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి పది లక్షలు, ఏపీకి 10 లక్షలు, అందించారు. కరోనా వైరస్‌ను అరికట్టడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు నిరంతరం శ్రమిస్తున్నాయని, ఈ విపత్కర పరిస్థితిని సమిష్టిగా ఎదుర్కోవాలని అశ్వినీదత్ పేర్కొన్నారు.


## సుకుమార్ పది లక్షలు



ప్రముఖ దర్శకుడు సుకుమార్ పది లక్షల విరాళాన్ని అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తలా ఐదు లక్షల విరాళం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విరాళాన్ని త్వరలో ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు సుకుమార్ చెప్పారు.

# అమూల్యమైన ఈ రోజులను వృధా చేయకండి!

క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, అందులోనూ ఉన్న మంచి విషయాలను ఎంచుకుని సద్వినియోగం చేసుకుందాం. పరుగులు పడుతూ శ్రమించే మనకు, పూర్తి స్థాయిలో కుటుంబంతో పాటు కొన్ని వారాలు గడిపే అవకాశం ప్రకృతి పరంగా లభించిందని అనుకుందాం. ఇంట్లో ఉన్న అందరితోనూ సంతోషంతో మాట్లాడుదాం. భవిష్యత్తులో ఇవి, మరచిపోలేని మధురానుభూతులుగా నిలిచిపోతాయి.


చిన్నారులకు మంచి పాఠాలు నేర్పించవచ్చు.



జీవిత భాగస్వామితో సమయం కేటాయించవచ్చు.


కుటుంబ సభ్యులందరూ కలసి ఆడుకోవచ్చు.


వ్యాయామం,యోగాకు ఎక్కువ సమయం కేటాయించవచ్చు.


వృద్ధులతో మాట్లాడుతూ ఉండొచ్చు.


మరిచిపోయిన వినోదపు క్రీడలను మళ్లీ గుర్తుకు తెచ్చుకుని ఆడుకోవచ్చు.


ఉమ్మడి ప్రార్థనలు చేయవచ్చు.


శ్రీమతికి వంట నుంచి విముక్తి కలిగించవచ్చు.


ఇంటి పనులు చేసుకోవచ్చు.


ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చు. కొత్త రంగానికి సంబంధించిన విషయాలను ఇంటర్నెట్ ద్వారా అవగాహన చేసుకోవచ్చు.


సమయం లేదని పక్కన పెట్టేసిన పుస్తకాన్ని పఠించవచ్చు.


బంధువులు, మిత్రులకు ఫోన్ చేసి బంధాన్ని దృఢపరుచుకోవచ్చు.

**లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్**

Lalithaa®©

